


నిష్పక్షపాతం.. సత్యనిష్ఠ..
అంకితభావం..
ప్రజల మేలు కోసం చూపే తెగువ
పత్రికలకు అవశ్యం.


# ఆంధ్రపత్రిక

స్వాతంత్ర్య సమరానికి అక్షరాయుధాలు అందించిన ఏకైక దినపత్రిక - స్థాపితం 1914

విశాఖపట్నం సంపుటి : 60 సంచిక : 27 • పేజీలు : 8 • ఆదివారం 27 అక్టోబరు 2024 • వెల : రూ. 5.00

Published from : Vijayawada| Visakhapatnam |Srikakulam | Rajahmundry|Kurnool|Guntur|Ongole| Nellore Tirupati




# ప్రజల నమ్మకాన్ని నెరవేర్చాలి

మంగళగిరి, అక్టోబర్ 26 (ఆంధ్రపత్రిక): తెలుగు దేశం పార్టీ ఆవిర్భావంతోనే తెలుగుజాతికి గుర్తింపు వచ్చింది. టీడీపీ రాకకు మందు, వచ్చిన తర్వాత తెలుగుజాతిని గురించి చెప్పుకోవాల్సి ఉంటుంది. ఎన్టీఆర్ సీఎం అయ్యాక తెలుగుజాతికి ప్రపంచవ్యాప్త కీర్తిని సాధించిపెట్టారు. సమాజమే దేవాలయం...ప్రజలే దేవుళ్లు అన్న ఎన్టీఆర్ స్ఫూర్తితో పార్టీ వారసులుగా మనందరం ముందు కెళ్లడడం గర్వించదగ్గ విషయం' అని టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని చంద్రబాబు ప్రారంభించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు చేతల మీదుగా సభ్యత్వ కార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా సభ్యత్వ నమోదు కరపత్రాన్ని విడుదల చేశారు. అనంతరం మిగతా 7లో



- కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా వైసీపీ కుట్ర
- టిడిపి పని పోయిందన్న వారే కనుమరుగు అయ్యారు
- ఎక్కడ ఇసుక దందా జరిగినా తిరుగబాటు చేయండి
- ఇసుక వ్యవహారంలో ఎవరూ జోక్యం చేసుకోవద్దు
- రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నాం
- తెలుగుజాతికి గుర్తింపు తెదేపాతోనే..
- మద్యం, ఇసుక విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు
- రూపాయి కూడా అవినీతి జరగడానికి వీల్లేదు
- కార్యకర్తల మనోభావాలు గౌరవించే పార్టీ తెదేపా.
- ఈ సారి కచ్చితంగా రాజకీయ పరిపాలనే చేస్తా.
- టిడిపి అధినేత చంద్రబాబు

"కాలుష్యం కారణంగా తాను వాకింగ్‌కు కూడా వెళ్లలేక పోతున్నానని సుప్రీం చీఫ్ జస్టిస్ డివై చంద్రచూడ్ చేసిన వ్యాఖ్యలు గమనార్హం. ప్రపంచంలో అత్యంత కాలుష్యభరిత నగరాలు 20 ఉంటే అందులో 15 మన నగరాలే.."

# వృక్ష సంహారం





- పర్యావరణ హితం పట్టని పాలకులు
- పెరుగుతున్న పట్టణీకరణతో కాలుష్యం
- నివారణ చర్యలు తీసుకోవడంలో విఫలం
- కోర్టులు మొత్తుకుంటున్నా పట్టింపు లేదు.
- పడిపోతున్న గాలి నాణ్యత..
- మానవమనుగడకే ముప్పు అంటున్న నిపుణులు

7లో

## ట్రంప్, కమలా హారిస్ ఫోన్ డేటా హ్యాకింగ్!



న్యూఢిల్లీ,అక్టోబరు 26: అమెరికాలో అధ్యక్ష ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధ్యక్ష అభ్యర్థులు డొనాల్డ్ ట్రంప్, కమలా హారిస్ ప్రచారం ఊపందు కుంది. అయితే, వీరి ప్రచారంపై చైనా హ్యాకర్లు పంజా విసురుతున్నట్లు తెలుస్తోంది. వీరి ఫోన్ కమ్యూనికేషన్లను లక్ష్యంగా చేసుకొని డ్రాగన్ సైబర్ ముఠా హ్యాకింగ్‌కు పాల్పడుతున్నట్లు సమాచారం. ఈ మేరకు విశ్వసనీయవర్గాలను ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్, ఆయన రన్నింగ్ మేట్ జేడీ వాన్స్ ఉపయోగిస్తున్న ఫోన్ల నుంచి చైనా హ్యాకర్లు డేటాను దొంగిలిస్తున్నట్లు న్యూయార్క్ టైమ్స్ సంచలన కథనం వెల్లడించింది. వీరితో పాటు డెమోక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్, మిగతా 7లో

## త్వరలోనే గాడిలోకి ప్రపంచ ఆర్థికవ్యవస్థ

### కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్



న్యూఢిల్లీ,అక్టోబరు 26: గత కొన్నేళ్లుగా తీవ్ర సవాళ్లను ఎదుర్కొంటున్న ప్రపంచ ఆర్థికవ్యవస్థ త్వరలోనే గాడిలో పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న ఆర్థికశాఖ మంత్రి మీడియానుద్దేశించి ప్రసంగించారు. ప్రపంచ దేశాలు, బహుపాక్షిక ఆర్థికసంస్థల మధ్య ఆర్థిక సమన్వయం పెరుగుతున్న నేపథ్యంలో ప్రపంచ ఆర్థికవ్యవస్థకు మంచి రోజులు రానున్నాయని ఆమె పేర్కొన్నారు."ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్, ప్రపంచబ్యాంకు సంయుక్తంగా నిర్వహించిన చర్చలతో ప్రపంచ ఆర్థికవ్యవస్థ గాడిలో పడే అవకాశాలు మిగతా 7లో

## ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్త వాతావరణం



న్యూఢిల్లీ, అక్టోబరు 26: పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తమ దేశంపై ఇరాన్ జరిపిన క్షిపణి దాడులకు ప్రతీకారంగా ఇజ్రాయెల్ శనివారం టెహ్రాన్‌పై విరుచుకుపడిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇరాన్, ఆ దేశ మద్దతున్న గ్రూప్‌లైన్ హమాస్, హెజ్బొల్లా నుంచి క్షిపణులు, డ్రోన్లు దూసుకురావొచ్చని నెతన్యాహు సేనలు అంచనా వేస్తున్నాయి. దాంతో లెబనాన్ సరిహద్దు కలిగిన ప్రాంతాల్లో రాకెట్ సైరన్లు మోగుతున్నాయి. అలాగే లెబనాన్ మిగతా 7లో

# పెట్టుబడులే లక్ష్యం



- అమెరికాకు చేరుకున్న నారాలోకేశ్
- 29న లాస్ వేగాస్‌లో జరుగనున్న ఐటీ సర్వీస్ సినర్జీ 9వ సదస్సుకు హాజరుకానున్న మంత్రి లోకేష్..
- పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విద్యావ్యవస్థలో మార్పులు

7లో



## కేంద్రం కీలక ఆదేశాలు

తప్పుడు వార్తలు వ్యాప్తి చెందకుండా చర్యలు

సోషల్ మీడియా ప్లాట్‌పామ్‌లకు ఆదేశాలు

అతిక్రమిస్తే చట్టం ప్రకారం చర్యలు : కేంద్రం

7లో

# జగన్‌పై వైఎస్ షర్మిల మండిపాటు

- వైవీ సుబ్బారెడ్డి.. జగన్ మోచేతి నీళ్లు తాగే వ్యక్తి
- ఆస్తులకు వారి పేర్లు పెట్టుకుంటే వారివే అవతాయా?
- తల్లిని కోర్టుకు ఈడ్చే కొడుకు ఉంటాడా..
- జగన్ పదవులు ఇస్తే సుబ్బారెడ్డి అనుభవిస్తున్నారు
- మీడియా సమావేశంలో షర్మిల



విజయవాడ, అక్టోబర్ 26 (ఆంధ్రపత్రిక): వైవీ సుబ్బారెడ్డి.. జగన్ మోచేతి నీళ్లు తాగే వ్యక్తి అని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మండిపడ్డారు. అన్ని కుటుంబాల్లో ఉంటే వ్యవహారం మిగతా 8లో



## వయనాడ్ ప్రజల తీరు స్ఫూర్తిదాయకం

పోటీ కొత్తేమో గానీ.. పోరాటం కొత్త కాదు..

ఈ అవకాశం రావడం గౌరవంగా భావిస్తున్నా..

మహిళల శ్రేయస్సు కోసం నా శక్తికి మించి కృషి చేస్తా..

ప్రియాంక గాంధీ..

7లో

## శింగనమలలో ఘోర ప్రమాదం

ఆరుగురు దుర్మరణం

టైరు పగిలి అదుపుతప్పి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొన్న కారు..



అనంతపురం, అక్టోబర్ 26 (ఆంధ్రపత్రిక): అనంతపురం జిల్లాలో శనివారం మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శింగనమల మండలం నాయనపల్లి క్రాస్ వద్ద లారీని కారు ఢీకొంది. టైరు పగిలి మిగతా 7లో

# ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం

- మార్కెట్ ఇంటర్వెన్షన్లపై మంత్రుల కమిటీని ఏర్పాటు చేసిన సర్కార్..
- మంత్రి నాదెండ్ల మనోహర్ నేతృత్వంలో ఏర్పాటైన కమిటీ
- ధరల పెరుగుదల నియంత్రణపై నివేదిక ఇవ్వాలని ఆదేశం
- కమిటీలో ఉన్న అచ్చెన్నాయుడు, సత్యకుమార్ యాదవ్, పయ్యావుల కేశవ్..




అమరావతి, అక్టోబర్ 26 (ఆంధ్రపత్రిక):ధరల నియంత్రణ, మార్కెట్ ఇంటర్వెన్షన్లపై ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ధరల నియంత్రణ, మార్కెట్ ఇంటర్వెన్షన్లపై మంత్రుల కమిటీని సర్కార్ ఏర్పాటు చేసింది. పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మిగతా 7లో



## క్రిప్టో కరెన్సీతో ఆర్థికరంగంపై ప్రభావం

క్రిప్టోలతో ఆర్థిక స్థిరత్వానికి పెను ముప్పు

ద్రవ్య లభ్యత, ఆర్థిక స్థిరత్వానికి భారీ ప్రమాదం పొంచి ఉంది

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ శక్తికాంత దాస్ ఆందోళన

7లో

## కలిసికట్టుగా పని చేద్దాం.. ఘన విజయం సాధిద్దాం



కూటమి నేతల సమావేశం

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై చర్చ

మంత్రులు నిమ్మల, కందుల ఆధ్వర్యంలో సమావేశం

హాజరైన ఎమ్మెల్యే నల్లమిల్లి, బలరామకృష్ణ, ఆదిరెడ్డి 3లో

ఒరులేయని యొనరించిన నరవర యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమ ధర్మపథముల కెల్లన్

ఆంధ్రపత్రిక

వ్యవస్థాపకులు: దేశోద్ధారక విశ్వదాత శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు

# పులులకు ఒక రోజు!

జూలై 29వ తేదీ 'అంతర్జాతీయ పులుల దినోత్సవం'. ప్రతి ఏటా ప్రపంచ వ్యాప్తంగా ఈ వేడుక నిర్వహిస్తారు. సుమారు పుష్కర కాలం నుంచి సాగుతోంది. 2010లో రష్యాలోని సెయింట్ పీటర్స్ బర్గ్‌లో జరిగిన పులుల సంరక్షణా సమావేశంలో ఈ దినోత్సవాన్ని ప్రకటించారు. పులుల సంరక్షణ, వాటి ఆవాసాల పరిరక్షణ దిశగా ప్రజల్లో అవగాహన కల్గించడమే దీని ముఖ్యోద్దేశం. ఈ అంశాలను సమీక్షిస్తే ఆశించిన స్థాయిలో అవగాహన పెరగలేదనే చెప్పాలి. అంతరించిపోతున్న జంతువుల జాబితాలోకి పులులు కూడా చేరిపోయాయన్నది చేదునిజం. పులుల ఉనికి ఎంతో అవసరమని శాస్త్రవేత్తలు గుర్తించారు. తగ్గిపోతున్న వాటి సంఖ్యను పెంచే దిశగా చర్యలు చేపట్టమని ప్రభుత్వాలకు వినతులు వెళ్తూనే ఉన్నాయి.ఎక్కువ దేశాల పాలకులు ఈ వినతులను పెద్దగా లక్ష్యపెట్టడం లేదని సంఖ్య తగ్గిపోతున్నట్లు తెలిపే నివేదికలే ఈ అంశాన్ని తేటతెల్లం చేస్తున్నాయి. ప్రపంచంలోని మొత్తం పులుల సంఖ్యలో దాదాపు 75శాతం మన దేశంలోనే ఉన్నాయి. పులులకు అతిపెద్ద, సురక్షిత నివాస ప్రాంతాల్లో భారతదేశం ఒకటని తెలుస్తోంది. భారతదేశంలో, గడచిన ఒకటిన్నర దశాబ్ద కాలంలో పులుల సంఖ్య దాదాపు రెట్టింపైంది. నాలుగేళ్ళకు ఒకసారి ఈ లెక్కింపు ప్రక్రియ జరుగుతుంది. 2018 గణాంకాల ప్రకారం దేశంలో మొత్తం 2,967 పులులు ఉన్నట్టు వెల్లడించారు. అభివృద్ధి-పర్యావరణం మధ్య సమతుల్యతను సాధించడం జీవఆవశ్యకతలో ముఖ్యమైంది. వేటపై నిషేధం,అవగాహనా కార్యక్రమాలు, చట్టాలను కట్టుదిట్టడం చేయడం మొదలైన చర్యల ద్వారా పులుల సంరక్షణను సాధించవచ్చు.కానీ అది సక్రమంగా జరగడం లేదన్నదే నిపుణులు, జంతుప్రేమికుల ఆవేదన. "మనిషి మాంసం రుచికి అలవాటు పడిన పులి మనుషుల కోసం వేటాడుతుంది,వెంటాడుతుంది, వెంపర్లాడుతుంది" అని అంటారు. పులుల సంగతి అలా ఉంచగా, పులులపై అక్రమ వ్యాపారం చేసి డబ్బులు సంపాయించే ఆకలికి అలవాటు పడిన మనిషి వల్ల, మనుషులు చేసే పనుల వల్ల పులుల సంఖ్య తగ్గిపోతోంది. పులుల ఉనికి ప్రశ్నార్థకమవుతోంది. ఈ శతాబ్దంలోనే పులిజనాభా 93శాతం తగ్గిపోయిందని సమాచారం. పశ్చిమ, మధ్య ఆసియా,జావా,బాలి ద్వీపాలు, ఆగ్నేయ ఆసియా,చైనాల్లోని విశాలమైన ప్రాంతాల్లో పులి చాలా వరకూ కనుమరుగై పోయింది. ఈ నేపథ్యంలో,1986లోనే పులిని అంతరించి పోతున్న జాబితాలో చేర్చారు.పులుల ఆవాస ప్రాంతాలు ధ్వంసమైపోవడం,వాటి నివాసాల్లో విభజన రావడం,వేట మొదలైన కారణాలతో పులుల సంఖ్య క్షీణించిపోయిందని తెలుస్తోంది. భూమిపై ఎక్కువ జనసాంద్రత కలిగిన ప్రాంతాలలోనూ నివసించడం వల్ల పులికి-మనిషికి మధ్య ఘర్షణ వాతావరణం కూడా పెరిగింది. బుద్ధిబలమున్న మానవుడి ముందు అంతటి శారీరక బలమైన జంతువు కూడా ఓడిపోయింది. పులిని మనం ఎన్ని రకాలుగా వాడుకోవాలో అన్ని రకాలుగా వాడుకున్నాం. జెండాల చిహ్నాలకు,దుస్తులకు, ఆయుధాలకు, ఆభరణాలకు, క్రీడా జట్ల చిహ్నాలకు, సర్వ గర్వ ప్రదర్శనకు, కథలకు,సినిమా పేర్లకు, సర్కస్‌లకు, వినోదాలకు, విహారాలకు.. ఒకటేమిటి అన్ని రకాలుగా వాడుకున్నాం. వాటి అవయవ భాగాలు కొన్నింటికి దివ్యఔషధాలు. పులివేటనిన్నమొన్నటి వరకూ రాజసానికి,వీరానికి చిహ్నంగా భావించేవారు. అదొక పెద్ద క్రీడగా అవతరించింది. రాజుల కాలం నుంచి ఆ వినదవిహారం మానవాళిలోకి ప్రవేశించింది. పులిచర్మాలకు ఉన్న గిరాకీ అంతాఇంత కాదు. ఈ వ్యాపారం ఇప్పటికీ అనేక చోట్ల పెద్దస్థాయిలో జరుగుతోంది. పులిగోర్ల గురించి తెలిసిందే. పులి అవయవాల వాణిజ్యం, వ్యాపారం చట్టరీత్యా పెద్ద నేరం. చట్టవిరుద్ధమని ప్రభుత్వాలన్నీ ప్రకటించాయి.ఎన్ని నిషేధాలు వచ్చినా ఆ బ్లాక్ మార్కెట్ సాగుతూనే ఉంది. చైనా కేంద్రంగా పెద్దఎత్తున ఈ అక్రమ వ్యాపార క్రీడ యదేచ్ఛగా సాగిపోతోందని కథనాలు వెల్లువెత్తుతూనే ఉన్నాయి. తైవాన్,దక్షిణ కొరియా, జపాన్ మొదలైన దేశాల్లో రవాణా బ్రహ్మాండంగా జరుగుతోందనే ప్రచారం ఉంది.అందిన కాడికి ఎవరి స్థాయిలో వారు ఆ యా మార్గాలలో డబ్బులు సంపాయిస్తూనే ఉన్నారు. పరిణామక్రమంలో,ప్రస్థానంలో, ఆధునిక జీవనంలో కొండలు, కోనలు, అరణ్యాలు కూడా మనిషికి ఆవాసమయ్యాయి.వనారణ్యాలు తగ్గిపోయాయి. జనారణ్యాలు పెరిగిపోయాయి. జంతువులు నివసించే ప్రాంతాలలోకి మనం వెళ్లిపోయాం. వాటికి దిక్కులేక, అప్పుడప్పుడు నరసంచారాల్లోకి వచ్చేస్తున్నాయి. ఒకప్పుడు ఊర్లకు దూరంగా ఉండే స్మశానాలు, ప్రజలకు ఉపయోగపడే చెరువులు, పంటపొలాలు కూడా మనిషికి నేడు నివాసస్థలా లయ్యాయి. శృతిమించిన, మతితప్పిన భూవ్యాపారాలకు పేదమానవులతో పాటు నోరులేని మూగజీవాలు కూడా ఆర్తనాదాలు చేస్తున్నాయి. సృష్టిలోని ప్రతి జీవీ విలువైనదే. ప్రతిదాని వల్ల అవసరం, ప్రయోజనం ఉన్నాయన్నది సత్యం. అన్ని జీవరాసులతో పాటు, పులులను కూడా సంరక్షించుకోవాలి. జీవవైవిధ్యాన్ని కాపాడుకోవాలి. ఆ దిశగా ప్రభుత్వాలు, ప్రజలు కలిసి సాగాలి.

# జగమెరిగిన దౌత్యవేత్త కె.ఆర్.నారాయణన్

**అక్టోబర్ 27 దివంగత రాష్ట్రపతి జయంతి**



పాత్రికేయునిగా, అధ్యాపకునిగా, ఉద్యోగిగా, విదేశాల్లో భారత విదేశాంగ శాఖ ప్రతినిధిగా, భారత రాయబారిగా, అత్యుత్తమ దౌత్యవేత్తగా, విదేశాంగశాఖ సెక్రటరీగా, వైస్ ఛాన్సలర్‌గా, మూడుసార్లు ఎంపీగా, కేంద్ర మంత్రిగా, ఉప రాష్ట్రపతిగా, రాష్ట్రపతిగా, కే.అర్.నారాయణ్ అందించిన బహుముఖ సేవలు చిరస్మరణీయాలు. కొచెరిల్ రామన్ నారాయణన్ (కె.ఆర్.నారాయణన్) (1920 అక్టోబర్ 27-2005 నవంబరు 9) పెరుమథనం, ఉఝవూర్ గ్రామంలో పేద దళిత కుటుంబంలో కొచెరిల్ రామన్ వైద్యర్, పున్నత్తురవీట్టిల్ పాపియమ్మ దంపతులకు జన్మించారు. నారాయణన్ వాస్తవానికి 4 ఫిబ్రవరి 1921న జన్మించినట్లు చెపుతారు. అయితే ఆయన మేనమామ, పాఠశాలలో యాదృచ్ఛికంగా 27 అక్టోబర్ 1920ను నమోదు చేయించినట్లు చెపుతారు. అదే తేదీని నారాయణన్ తన పుట్టిన తేదీగా ఎంచుకుని, అధికారికంగా ఉండటానికి అనుమతించారు. అలా అధికారిక రికార్డుల ప్రకారం, తేదీ 27 అక్టోబర్ 1920 జన్మదినం అయింది. ఆయన భారతదేశ 10వ రాష్ట్రపతి. నారాయణన్ సెయింట్ జాన్స్ హైస్కూలు కూతట్టుకుళంలో అనంతరం సెయింట్ మేరీ హైస్కూలు, కురవిలంగడ్ లో చదివి మెట్రిక్యులేషన్ (1936-37) పూర్తి చేసారు. ఇంటర్మీడియట్ విద్యను కొట్టయంలోని సి.ఎం.ఎస్ కళాశాలలో (1938-40) పూర్తి చేసారు. నారాయణన్ బి.ఎ (ఆనర్స్), ఆంగ్ల సాహిత్యంలో ఎం.ఎ డిగ్రీలను ట్రావెన్స్‌కోర్ విశ్వ విద్యాలయం (ప్రస్తుతం కేరళ విశ్వ విద్యాలయం) నుండి పూర్తిచేసారు. విశ్వ విద్యాలయంలో ప్రథమ శ్రేణిలో (ట్రావెన్స్‌కోర్‌లో డిగ్రీలో మొదటి శ్రేణిలో ఉత్తీర్ణుడైన మొదటి దళిత విద్యార్థి) ఉత్తీర్ణుడయ్యారు. ఆయన కుటుంబం తీవ్రమైన యిబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో ఢిల్లీ వెళ్ళి ది హిందూ, ది టైమ్స్ ఆఫ్ ఇండియా పత్రికలలో పాత్రికేయుడిగా (1944-45) పని చేసారు. ఎం.మున్షీ ప్రచురిస్తున్న సోషల్ వెల్ఫేర్ వారపత్రికకు లండన్ విలేకరిగా వ్యవహరించారు. పాత్రికేయులుగా కొంత కాలం పనిచేసిన తర్వాత, ఉపకార వేతనం సహాయంతో లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో రాజకీయ శాస్త్రాన్ని అధ్యయనం చేసారు. నెహ్రూ ప్రభుత్వంలో భారత విదేశాంగ శాఖలో ఉద్యోగిగా నారాయణన్ తన వృత్తి జీవితాన్ని ప్రారంభించారు. నారాయణన్ ప్రతిభను గుర్తించిన జవహర్ లాల్ నెహ్రూ ఆయనను రంగూన్‌లోని భారత విదేశాంగ శాఖలో భారతదేశ ప్రతినిధిగా నియమించారు. ఆయన జపాన్, యునైటెడ్ కింగ్‌డమ్, థాయ్‌లాండ్, టర్కీ, చైనా, అమెరికా సంయుక్త రాష్ట్రాలు దేశాలలో భారత రాయబారిగా పనిచేసారు. అమెరికాలో భారత రాయబారిగా 1980 నుండి 1984 వరకూ నాలుగేళ్ళు పనిచేసారు. ఆయనను దేశంలో అత్యుత్తమ దౌత్యవేత్తగా నెహ్రూ పేర్కొన్నారు. 1949లో భారత విదేశాంగ సర్వీసులో (ఐ.ఎఫ్.ఎస్) నెహ్రూ అభ్యర్థన మేరకు చేరారు. దౌత్యవేత్తగా రంగూన్, టోక్యో, కెనడా , హనోయ్ లలో పని చేసారు. థాయ్‌లాండ్ (1967-69), టర్కీ (1973-75), చైనా(1976-78)ల భారత అంబాసిడర్‌గా ఉన్నారు. 1954 లో ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్‌లో బోధించారు. అతను జవహర్‌లాల్ నెహ్రూ ఫెలోషిప్ (1970-72) పొందారు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖలో సెక్రటరీగా (1976) ఉన్నారు. 1978లో పదవీ విరమణ చేసిన తరువాత అతను న్యూఢిల్లీ లోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వ విద్యాలయానికి వైస్-ఛాన్సలర్ గా 1979 జనవరి 3 నుండి 1980 అక్టోబరు 14 వరకు పనిచేసారు. ఈ అనుభవం తన ప్రజా జీవితానికి పునాదిగా ఆయన అభివర్ణించాడు. తరువాత పదవీ విరమణ నుండి తిరిగి వచ్చి ఇందిరా గాంధీ ప్రభుత్వ కాలంలో 1980 నుండి 84 వరకు అమెరికా సంయుక్త రాష్ట్రాలలో భారత అంబాసిడర్‌గా తన సేవలనందించారు. ఇందిరా గాంధీ అభ్యర్థన మేరకు రాజకీయాలలోనికి ప్రవేశించారు. 1984, 1989, 1991లలో వరుసగా మూడు సార్లు పాలక్కాడ్ (కేరళ) లోని ఒట్టపాళం నియోజక వర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొంది లోక్‌సభకు ఎన్నిక య్యారు. రాజీవ్ గాంధీ కేబినెట్‌లో రాష్ట్ర వ్యవహారాల మంత్రిగా ఉన్నారు. 1985 లో ప్లానింగ్, 1985-86 మధ్య విదేశీ వ్యవహారాలు, 1986-89 మధ్య సైన్సు అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ పదవులను స్వీకరించారు. 1992 ఆగస్టు 21న నారాయణన్ భారత ఉప రాష్ట్రపతిగా ఎన్నుకో బడ్డారు. అప్పటి రాష్ట్రపతి శంకర్ దయాళ్ శర్మ. ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నారాయణన్ పేరును మొదటి సారిగా జనతాదళ్ పార్లమెంటరీ పార్టీ నాయకులు, పూర్వపు భారత దేశ ప్రధానమంత్రి వి.పి.సింగ్ ప్రతిపాదించారు. జనతాదళ్, పార్లమెంటులోని వామపక్ష పార్టీలు ఉమ్మడిగా ఆయనను అభ్యర్థిగా ప్రకటించా యి. తరువాత పి.వి. నరసింహారావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నుండి మద్దతు పొందింది. అలా ఆయన ఏకగ్రీవ ఎన్నిక కు మార్గం సుగమమైంది. కె.ఆర్. నారాయణన్ 1997 జూలై 17న భారత రాష్ట్రపతిగా ఎన్ని కయ్యారు. రాష్ట్రపతి ఎన్నికలలో ఆయనకు 95% ఎలక్టోరల్ కాలేజీ ఓట్లు వచ్చాయి. కేంద్రంలో మైనారిటీ ప్రభుత్వం ఉన్న సమయంలో జరిగిన ఏకైక అధ్యక్షుని ఎన్నిక ఇది. ఆయనకు టి. ఎన్. శేషన్ ఏకైక ప్రత్యర్థి అభ్యర్థి. శివసేన తప్ప మిగతా ప్రధాన రాజకీయ పక్షాలన్నీ నారాయణన్‌కు ఆ అధ్యక్ష ఎన్నికలలో మద్దతు నిచ్చాయి. 1998 సార్వత్రిక ఎన్నికలలో నారాయణన్ రాష్ట్రపతి భవన్ సముదాయం లోని ఒక పాఠశాలలో నిర్వహింప బడుతున్న పోలింగు బూత్‌లో సామాన్య ఓటర్లతో కలసి వరుసలో నిలబడి ఓటు వేసి పదవిలో ఉండి ఓటు వేసిన మొదటి రాష్ట్రపతిగా గుర్తింప బడ్డారు. అధ్యక్షునిగా నారాయణన్ తన వివేచనా శక్తులను ఉపయోగించి ఆయన తీసుకున్న వివిధ నిర్ణయాలు, ఆలోచనను దేశానికి వివరించే ముఖ్యమైన ఆచరణను ప్రవేశపెట్టారు. ఇది అధ్యక్షుడి పనితీరులో పారదర్శకతకు దారి తీసింది. నారాయణన్ అధ్యక్షునిగా ఉన్న సమయంలో వివిధ రాజకీయ పార్టీలలో ఎవరికీ సభలో విశ్వాసం పొందవలసిన స్థితి లేదని వారితో సంప్రదింపుల ద్వారా నిర్ణయించు కున్న తరువాత లోక్ సభను రెండు సార్లు రద్దు చేయ బడింది. అధ్యక్షులుగా నారాయణన్ ఒక రాష్ట్రంలో రాజ్యాంగంలోని 356 అధికరణ క్రింద రాష్ట్రపతి పాలనను విధించేందుకు కేంద్ర మంత్రివర్గం చేసిన సిఫారసును పునః పరిశీలించమని రెండు సార్లు కోరారు. గుజ్రాల్ ప్రభుత్వం (1997 అక్టోబరు 22) ఉత్తర ప్రదేశ్‌లోని కళ్యాణ్‌సింగ్ ప్రభుత్వాన్ని రద్దు చేయాలన్నప్పుడు, అటల్ బిహారీ వాజపేయి ప్రభుత్వం (1998 సెప్టెంబరు 25) న బీహార్ లోని రబ్రీదేవి ప్రభుత్వాన్ని రద్దు చేయాలన్నప్పుడు ఆ విధంగా పునః పరిశీలను కోరారు. భారత రాష్ట్రపతిగా పదవీ విరమణ చేసిన తరువాత కె.ఆర్. నారాయణన్ తన భార్య ఉషతో పాటు తన శేష జీవితాన్ని సెంట్రల్ ఢిల్లీ బంగ్లా (34 పృథ్వీ రోడ్) లో గడిపారు. ముంబై (21 జనవరి 2004)లో వరల్డ్ సోషల్ ఫోరమ్ "ప్రత్యామ్నాయ ప్రపంచీ కరణ ఉద్యమానికి" తన మద్దతును అందించారు. ఆయన సిద్ధ, ఆయుర్వేదం కోసం నవజ్యోతిశ్రీ కరుణాకర గురు పరిశోధనా కేంద్రాన్ని స్థాపించడానికి ఉఝావూరు నుండి పోథెన్‌కోడ్‌లోని సంతిగిరి ఆశ్రమానికి వెళ్ళారు. కె.ఆర్.నారాయణన్ 2005 నవంబరు 9న తన 85వ యేట న్యూఢిల్లీ లో మరణించారు. ఆయనకు హిందూ ధర్మ శాస్త్రం ప్రకారం దహన కార్యక్రమాలను సైనిక లాంఛనాలతో చేసారు. ఇది రాజ్‌ఘాట్ కు సమీపంలోని "కర్మ భూమి"లో జరిగింది.

-రామ కిష్టయ్య సంగన భట్ల

# జానపదాలలోని లాలిత్యాన్ని రుచి చూపించిన కొసరాజు

**(అక్టోబర్ 27న కొసరాజు వర్ధంతి సందర్భంగా)**

జానపదగీతాల్లోని లాలిత్యాన్ని తెలుగు సినిమాకు రుచి చూపించిన కవి ఆయన.. "ఏరువాక సాగాలోరన్నో" అంటూ సేద్యగాళ్ళకు ఉత్సాహం రేకెత్తేలా ధైర్యం చెప్పిన గొప్ప కవి పుంగవుడాయన.. "రామయతండ్రి ఓ రామయ తండ్రి మానోములన్ని పండినాయి రామయ తండ్రీ" అని గుహుడి చేత శ్రీరాముడ్ని ఏరు దాటించిన మహా రచయిత.. ఆయన పేరు కొసరాజు, తెలుగంటే ఆయనకు పెద్దమోజు.... ఆయనే కొసరాజు రాఘవయ్య చౌదరి.. కోసరాజుగా ఖ్యాతిగాంచిన ఆ జానపద గీతాల రారాజు గురించి ఎంతరాసినా తక్కువే. తెలుగు పదం, తెలుగు పద్యం, తెలుగుతనం మూర్తీభవించిన మహోన్నత వ్యక్తిత్వం ఆయనది. జయమ్మునిశ్చయమ్మురా, వినరావినరానరుడా..., సరిగంచు చీరగట్టి... శివగోవింద గోవింద, డబ్బులోనె ఉందిరా, .నందామయా గురుడ, శివశివమూర్తివి, తింటానిక్కూడుచాలదే, ,చెంగుచెంగునా గంతులు వే... యండి,... సరదా సరదా సిగిరెట్టు, .... ఆడుతుపాడుతూ పనిజేస్తుంటే, ముక్కు చూడు ముక్కందం చూడు... ఇలాంటి అద్భుత గీతాల సృష్టి కర్త ఆయన.. మూడున్నర దశాబ్దాల కాలంలో మూడువేలకు పైగా గీతాలు రాసి 'కవిరత్న'గా, 'జానపద కవి సార్వభౌముడు'గా ప్రేక్షకుల మన్ననలు పొందిన మహా రచయిత కొసరాజు. కేవలం హాస్యప్రధానమైన పాటలే గాకుండా, విభిన్నమైన అంశాలపై ఆయన అద్భుత పాటలు రాశారు. 'తోడికోడళ్ళు" చిత్రం కోసం "ఆడుతు, పాడుతు పనిచేస్తుంటే అలుపు సొలుపు ఏమున్నది" అంటూ శ్రమైక జీవన సౌందర్యాన్ని చాటారు. అభ్యుదయ భావాలతో, సామ్యవాద దృక్పథంతో సమాజంలోని అవినీతిని ఎండగట్టిన ఆయన పౌరాణిక చిత్రాలకు సైతం మహత్తర పాటలు రాశారు. కొసరాజు రాఘవయ్య చౌదరి 1905లో సెప్టెంబర్ 3న బాపట్ల తాలూకా కర్లపాలెం మండలం చింతాయపాలెంలో లక్ష్మమ్మ, సుబ్బయ్య దంపతులకు జన్మించారు. సొంత వూరు అప్పికట్లలో నాలుగో తరగతి వరకు చదివారు. వీధిబడిలో వుండగానే ఆయన బాలరామా యణం, ఆంధ్రనామసంగ్రహం వంటి గ్రంథాలు క్షుణ్ణంగా చదివారు. వరుసకు పెదనాన్న అయిన త్రిపురనేని రామస్వామి ద్వారా అచ్చ తెలుగు నుడికారము, తర్కవితర్కాలు, తెలుగు భాషా సౌందర్యము తెలుసుకున్నారు. యక్షగానాలు, వీధిభాగవతాలు, హరికథలు, జముకుల కథలు, బుర్రకథలు, భజనగీతాలు, పగటివేషగాళ్ళ పాటలు, రజకుల పాటలు, పాములోళ్ళపాటలు, గంగిరెద్దుల గీతాలు ఎన్నో రాశారు. నరసింహం పంతులు వ్రాసిన రామాయణం నాటకంలో పాత్రలు ధరించి నాటక రంగానికి పరిచయమయ్యారు . పిదప కొంత కాలం 'రైతు పత్రిక' కు జర్నలిష్టుగా ఉన్నారు. ఆ సమయం లోనే ప్రముఖ సంగీత దర్శకుడు సముద్రాల రాఘవాచార్యులు, నిర్మాత గూడవల్లి రామబ్రహ్మం గార్లతో పరిచయం ఏర్పడింది. అప్పటికే రైతు ఉద్యమం మీద పాటలు రాసి, ఒక ఊపు ఊపుతున్న కొసరాజుచేత, రామబ్రహ్మం సినిమాలకు రాయించడం మొదలుపెట్టారు. తాపీ ధర్మారావు, త్రిపురనేని గోపీచంద్ మాటలు రాస్తే విశ్వనాథ కవిరాజు హాస్య సన్నివేశాలు రాశారు. సముద్రాల, తాపీ, కొసరాజు పాటలు రాశారు. 'రైతుబిడ్డ' తర్వాత ఆయన స్వస్థలం వెళ్లిపోయి వ్యసాయంతోపాటు సాహితీ వ్యవసాయం కూడా చేస్తూ వచ్చారు. పదమూడేళ్ల తర్వాత డి.వి. నరసరాజుగారి సూచనతో కె.వి.రెడ్డి 'పెద్దమనుషులు' సినిమాతో మళ్ళీ సినిమా రంగంలో అడుగుపెట్టి సినిమా రచ యితగా ఎదిగారు. తెలుగు సినిమా పాటల రచయితగా కొసరాజుది ప్రత్యేకపీఠం. ఆ రోజుల్లోని చాలా చిత్రాలు కొసరా జు ముద్రని బాగా వాడుకున్నాయి. వ్యంగ్యం, హాస్యం మిళా యించిన పాట ఒకటి చిత్రంలో వుండాలి, అది రాఘవ య్య చౌదరిగారు రాయాలి-అని అప్పట్లో సినిమా జనాలకు ఒక సూత్రం ఉండేది. ఆ సూత్రానికి తగ్గట్టుగానే కొసరాజు వందలా ది గీతాసుమాల్ని గుచ్చి ప్రకాశ పరిమళభరితం చేశారు. జానపదగీతాల్లోని లాలిత్యాన్ని, ఆ పొగరూ వగరూ ఏమాత్రం తగ్గకుండా తెలుగు సినిమాకు అమర్చిపెట్టింది కొసరాజు రాఘ వయ్య చౌదరి. ఆయన తొలుత కథానాయకునిగా రైతుబి డ్డ (1939) అనే చిత్రంలో నటించారు కవిగా రాఘవయ్య ప్రతిభ గుర్తించిన బి.ఎ.సుబ్బారావు, కె.వి.రెడ్డి వారి చిత్రాలకు పాటలు రాయించారు. 'పెద్ద మనుషులు' చిత్రానికి ఆయన రాసిన పాటలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. సుబ్బారావు గారి 'రాజు పేద' చిత్రంలో 'జేబులో బొమ్మ జె జేలబొమ్మ' బహుళ ప్రాచుర్యం చెందింది. రోజులు మారాయి (వహీదా రెహ్మాన్ నాట్యముతో)లో 'ఏరువాక సాగారో', 'ఇల్లరికంలో ఉన్న మజా', 'అయ్యయ్యో జేబులో డబ్బులు పోయెనే' 'ముద్దబంతి పూలు బెట్టి' తదితర పాటలు కోట్లాది తెలుగు ప్రేక్షకుల మనసులను కొల్లగొట్టాయి. ఇలా మూడున్నర దశాబ్దాల కాలంలో మొత్తం 200 చిత్రాలకుపాటలు రాశారు. ఆయన తెలుగువాడిగా పుట్టినందుకు అనేక సందర్భాల్లో ఎంతో గర్వించారు. ఎన్నో పద్యాలు రాశారు. "రైతు జన విధేయ రాఘవయ్య" మకుటంతో రాసిన శతకంలో ఆంధ్రప్రదేశ్‌కి, తెలుగుభాషకి జరుగుతున్న అన్యాయాన్ని ఎలుగెత్తిచాటారు. "సంస్కృతము కొరకు చలపట్టునొక్కండు, హిందియనుచు గంతులిడు నొకండు, తెలుగుకొరకు నేడ్చు ధీరుండు కరువయ్యె...'అంటూ వాపోయారాయన. కాదేదీ కవితకు అనర్హమన్న రీతిలో చెట్టు, గట్టు, పుట్ట, అట్టు, సిగరెట్టు, పండుగలు, పేకాటలు, తాగుళ్ళు, ఇల్లరికపుటల్లుళ్ళ గురించి ఎన్నో పాటలు రాశారు. వినోదాన్ని విషాదాన్ని, భక్తిని, రక్తిని సమయోచితంగా తనకలం ద్వారా ఆవిష్కరించారు. సామెతలు, పలుకుబళ్ళు, తెలుగునుడికారంతో గేయ సాహిత్యా నికి వన్నె తెచ్చిన కొసరాజు 1984లో రఘుపతి వెంకయ్య అవార్డును, 1985లో కళాప్రపూర్ణ బిరుదును పొందారు. ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ నిర్వహించిన బుర్రకథల పోటీలో "నవభారతం" బుర్రకథకు ఆయన ప్రథమ బహుమతి పొందారు. అఖిలభారత కాంగ్రెస్, ఫిలింఛాంబర్ ఆఫ్ కామర్స్, రాజ్యలక్ష్మి వెంకన్న చౌదరి ఫౌండేషన్ వంటి సంస్థలు ఆయన్ని ఘనంగా సత్కరించాయి. తెనాలి క్లాసికల్ ఫిలిమ్ సొసైటీ నుంచి సముద్రాల రాఘవాచారి అవార్డు అందుకున్నారు. తెలుగు ప్రజానీకం 'కవి రత్న' 'జానపద కవి సార్వభౌమ' తదితర బిరుదులు ఇచ్చింది.'కొండ వీటి వైభవం' (ఖండకావ్యం), గండికోట యుద్ధం (ద్విపద కావ్యం), కొసరాజు విసుర్లు, సిన్మాడైరెక్టర్ అనే పుస్తకాలను రాసి సాహిత్య లోకానికి అందించారు. చివరిసారిగా సురేష్ ప్రొడక్షన్ వారి "గురుబ్రహ్మ"చిత్రానికి 1986 అక్టోబర్ 27వ తేదీన "వినరా, ఆంధ్రకుమారా" అనే బుర్రకథను రాసి, అదేరోజు రాత్రి పది గంటలకు పరమపదించారు. కొసరాజు లేని లోటు ఎన్నటికీ పూడ్చలేనిది

-దాసరి దుర్గా ప్రసాద్

# భారత్‌లో పేదరికం తగ్గేది ఎప్పుడో?

78 సం" రాల స్వతంత్ర భారత్‌లో కేంద్ర ప్రభుత్వం అవలంభించిన వ్యవసాయ' ఆర్థిక 'ప్రణాళిక' పారిశ్రామిక పెట్టుబడి 'ఉత్పత్తి 'మార్కెటింగ్ సమాచార 'విదేశీవర్తకం 'సాంకేతిక' పరిజ్ఞాన విధానాల వల్ల ధనికులు మరింత ధనవంతులై పేదవారు మరింత పేదరికంలోకి నెట్టి వేయబడి దేశంలో వివిధ వర్గాల ప్రజల ఆదాయాల్లో సంపదలో ఆర్థిక వ్యత్యాసాలు విపరీతంగా పెరిగాయి. ప్రపంచంలో 5 పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న ఇండియా 2030 నాటికి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ స్థానానికి చేరుకుంటుందని ఎస్' అండ్' పీ గ్లోబల్ రేటింగ్ సంస్థ తాజాగా ప్రకటించడం గమనార్హాం.

**దంద్వ ఆర్థిక వ్యవస్థ:** 3.6 లక్షల కోట్ల డాలర్ల స్థాయిలో వున్న భారత దేశ ఆర్థిక వ్యవస్థ పరిమాణం 2046 నాటికి 8 రెట్లకు పెరుగు తుందన్న నివేదికల అధ్యయనాలు వెల్లడించడం వినడానికి గొప్పలు చెప్పుకునే పరిస్థితిలో ఉన్నప్పటికీ మరోవైపు దేశంలో అట్టడుగు స్థాయిలో జీవిస్తున్న పేదల సంఖ్య ఆశించిన స్థాయిలో తగ్గని విచిత్ర స్థితి నెలకొనడం విచారకరం. దేశంలో ధంద్వ ఆర్థిక వ్యవస్థ అమల్లో వుంది. పేదలు ఉన్న జనాభా భారత్ ఐక్యరాజ్య సమితి ఇటీవల వెల్లడించిన తాజా నివేదిక ప్రకారం ప్రపంచ దేశాల్లో పేద ప్రజల జనాభా ఎక్కువగా భారతదేశంలోనే ఉన్నారని. ప్రపంచ వ్యాప్తంగా 110 కోట్ల మంది పేదలు ఉండగా అందులో 23.4 కోట్ల మంది భారతదేశంలోనే ఉన్నారనే విషయాన్ని తమ అధ్యయనంలో వెల్లడించింది. మన ప్రగతి వెలుగుల మాటున మగ్గిపోతున్న జీవితాలకు అద్దం పడుతుంది .ప్రజల ఆదాయాలు' జీవన ప్రమాణాల్లో మెరుగుదల అభివృద్ధికి సరైన కొల మాణాలు. జి'డి 'పిలో ఉన్నత స్థాయికి చేరుతున్న ఇండియా తలసరి ఆదాయం పరంగా 140 దేశాల కన్నా దిగువన ఉంది. ఆక్స్ఫామ్ నివేదిక ప్రకారం జనాభాలో ఒక శాతం చేతుల్లో40 శాతం దేశ సంపద కేంద్రీకృత మై ఉంది .ఆర్థిక ప్రగతి తో ప్రజ్వరిల్లుతున్న ఆర్థిక వ్యవస్థలో ఆర్థిక అసమానతలు 'పేదరికం నిరుద్యోగం 'రూపుమా పడంలోప్రభుత్వం విఫలమైంది.

**తగ్గని దారిద్ర్యం:** సమాజంలో ఉన్నత వర్గాల సంపద ఆదాయం పెరుగుతూ ఉంటే దిగువ శ్రేణిలో వున్న వారి పరిస్థితి నానాటికి దిగజారిపోతుంది. ధనికులు మరీ ధనికులై పేదలు మరింత పేదరికంలోకి కుంగి పోతున్నారు. దారిద్ర్య రేఖ కింద జీవించే ప్రజల శాతం ఆశించిన మేరకు తగ్గలేదు.



**సంపదబికేంద్రీకరణ:** ఆర్థిక వ్యవస్థలో మొత్తం జాతీయ సంపద 71% జనాభాలో పై 10 శాతం కలిగి ఉన్నారు. ఇండియాలో 119మంది బిలియనీర్లు వున్నారు. వీరి సంపద పది ఏళ్లలో 10 రెట్లు పెరిగింది.మనదేశంలో రోజుకు 70 మంది కొత్తగా మిలియనీర్లు అవుతున్నారు. దేశంలో ఉత్పత్తి చేయబడిన 73 శాతం దేశంలో అత్యంత ధనవంతులైన1శాతంమందికి చేరింది. 670మిలియన్ పేదల సంపదలో కేవలం1 శాతం మాత్రమే పెరుగుదల సూచిస్తుంది. 5వ ఆర్థిక శక్తి భారత్ అమెరికా 'చైనా' జపాన్' జర్మనీ 'తర్వాత భారత్ జి'డి'పిలో దూసుకుపోతూ 5 వఆర్థిక శక్తిగా ఎదుగుతున్నప్పటికి ప్రజల ఆదాయాలు 'సంపద 'ఆర్థిక వ్యత్యాసాలు'ద్రవ్యోల్బణం' ప్రాంతీయ అసమానతలు పెరుగు తున్నాయి. హురూన్ ఇండియా వెల్లడి ఇటీవల హురూన్ ఇండియా సంస్థ దేశంలోని అత్యంత సంపన్నుల జాబితా విడుదల చేసింది. జూలై31 నాటికి దేశంలో కుబేరుల సంఖ్య 1539కి పెరిగింది. వీరి వద్ద పోగైన సంపద రూ.159లక్షల కోట్లు. వీరి ఆస్తులు ఈ ఏడాది 46% వృద్ధి చెందాయి. దేశం లో 140 కోట్ల జనాభాలో ఆదాయ అసమానతలు' సంపద అసమానతలు 'ఆర్థిక వ్యత్యాసాలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఈ పరిస్థుతులు ఇలాగే కొనసాగితే సామాజిక అశాంతికి దారితీసే ప్రమాదం వుందని సామాజిక ఆర్థిక వేత్తలు అభిప్రాయ పడుతున్నారు.

**స్వదేశీ పాలనబి ఆర్థిక అసమానతలు:** బ్రిటిష్ కాలం నాటి కంటే స్వదేశీ పాలనలో కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ఆర్థిక 'ప్రణాళిక 'పారిశ్రామిక సేవల 'ఉత్పత్తి 'మార్కెటింగ్ ఉపాధి 'రవాణా 'సమాచార విధానాల వల్ల ఆర్థిక వ్యవస్థలో అసమానతలు పెరుగుతున్నాయి. వివిధ అభివృద్ధి నివేదికల ప్రకారం పరిశీలిస్తే దేశంలో1శాతం జనాభాచేతుల్లో40.01శాతం సంపద కేంద్రీకృతమై వుంది. వివిధ వర్గాల ఆదాయ' సంపద 'అసమానతలు పెరుగుతున్నాయి. వాస్తవిక ఆదాయం క్రమంగా పెరుగుతున్నపటికి ప్రజల ఆదాయాల మధ్య అంతరాలు పెరుగుతున్నాయి. దీనికి కారణం కేంద్ర ప్రభుత్వం అనుసరించిన 1991 ఆర్థిక సంస్కరణలే... 1991 కిముందు మన దేశ జి'డి'పి లో3శాతం వద్ద వృద్ధి ఆగిపోయింది. సంస్కరణల తర్వాత మన దేశ జి'డి'పి 6-8శాతం వృద్ధి రేటు పెరిగింది. ఈ కాలంలో అతి తక్కువ శాతం జనాభాలో గరిష్ఠ సంపద పెరిగింది. ఇదే కాలంలో ప్రభుత్వం ఆర్థిక అంతరాలు తగ్గించే చర్యలు తీసుకోలేదు. ఆర్థిక వ్యవస్థలో ఉపాధి రహిత ఉత్పత్తి ఉత్పాదకత 'నిరుద్యోగం పెరిగి ఆర్థిక ఆదాయ అసమానతలను తీవ్రతరం చేశాయి.

**దంద్వ ఆర్థిక విధానాలు:** దేశంలో జరిగిన గణనీ యమైన ప్రగతి వల్ల సుమారు 25 కోట్ల మంది కఠిన పేదరికం నుండి విముక్తి పొందారని" నీతి అయోగ్" చర్చా పత్ర లో ప్రకటించడం జరిగింది. 5 శాతంకంటే తక్కువ మంది భారతీయులు పేదరికంలో ఉన్నారనినీతి ఆయోగ్ సి' ఇ'ఓ పేర్కొన్నారు. ఒక వైపు 81కోట్ల మంది ప్రజలకు ప్రభుత్వమే ఉచితంగా ఆహారధాన్యాలు పంపిణి చేస్తుంది. ప్రభుత్వానికి వచ్చే రాబడి లెక్కల మీధ ఆధారపడి పేదరికాన్ని లెక్కించడం సరైంది కాదు. నాణ్యమైన.విధ్య వైద్యం 'ఆరోగ్యం తాగునీరు పౌష్టికాహారం మున్నగు అంశాలు సామాన్యులకు అందుబాటులో ఉన్నాయా? లేదా అంశాల్ని పరిశీలించాలి. అందుబాటులో లేని ప్రజారోగ్యం ప్రభుత్వ ఆసుపత్రులు సిబ్బంది కొరత' మౌలిక వసతుల కొరత 'బెడ్స్ కొరత 'మందుల కొరతతో కునారిల్లుతు న్నాయి. పేద వర్గాల ప్రజలకు కనీస వైద్య సేవలు అందుబాటులో లేక పోవడం వల్ల ప్రైవేటు కార్పొరేట్ ఆసుపత్రులకు ఆశ్రయించ వలసి వస్తుంది. ఖరీదైన వైద్య ఖర్చులు భరించలేక అప్పుల పాలై ఆర్థిక భారాన్ని మోయలేక ఉన్న ఆస్తులను అమ్ముకొని పేదలు పేదరికంలోకి నెట్టి వేయబడుతున్నారు. 5ఏళ్ల లోపు పిల్లలు పౌష్టికాహార లోపంతో ఆరోగ్య పరంగా ఎదుగుదల లోపించింది. ఐ'రా'స ఆహార వ్యవసాయ సంస్థ(ఎఫ్' ఎ 'వో") పరిశీలన ప్రకారం 74.1% భారతీయులు పోషకాహారాన్ని పొందలేని నిస్సహాయ పరిస్థితుల్లో బతుకులు వెల్లదీస్తున్నారని అధ్యయనాలు తెలియ చేస్తున్నాయి. ఆహార ద్రవ్యోల్బణం' చాలీ చాలని ఆదాయాలు ' పేదరికం కోరల్లో చిక్కుకున్న కుటుంబాల దీన స్థితిని అద్దం పడుతుంది. పోషకాహార లోపం బాల భారతాన్ని శక్తిహీనం చేస్తూందనే వాస్తవాన్ని బయట పెట్టింది. దేశ వ్యాప్తంగా 6 నుంచి 23వ నెలల వయసు లోని చిన్నారుల్లో 77% వైవిధ్య భరితమైన పోషకాహారానికి నోచుకొని పరిస్థితులు ఉన్నాయని పరిశోధనల్లో తేలింది. వ్యాధినిరోధక శక్తి శిశుమరణా లు పోషకాహార లోపం వల్ల వ్యాధిని రోధక శక్తి తగ్గి 54 శాతం వ్యాధులు ప్రభులుతున్నాయని జాతీయ పోషకాహార సంస్థ నిపుణులు పేర్కొన్నారు. ఎయిమ్స్ ప్రచురించిన మెడికల్ జర్నల్లో దేశంలో 6 నుండి 23నెలల పిల్లల్లో మూడోవంతు మంది మరణాల ముప్పును ఎదుర్కొంటున్నారని పేర్కొంది. రాష్ట్రాలు పోషకాహారం కొరత రాష్ట్రాల వారీగా చూస్తే మహారాష్ట్ర 'ఉత్తరప్రదేశ్' మధ్యదేశ్ గుజరాత్ 'రాజస్థాన్‌తో పాటు మొత్తం8 రాష్ట్రాల్లో 80 శాతం మంది పిల్లలకు నిర్దేశిత పోషకాహారం లభించడం లేదు. తెలంగాణ' ఎపితో సహా 12 రాష్ట్రాల్లో పోషకాహారం లభించని పిల్లల సంఖ్య 70.80 శాతం మధ్యలో ఉంది.

-నేదునూరి కనకయ్య

# అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా త్రీ టౌన్ స్టేషన్





**తెనాలి అక్టోబర్ 26 (ఆంధ్రపత్రిక) :** తెనాలి త్రీటౌన్ పరిధిలో అసాంఘిక కార్యక్రమాలు విచ్చలవిడిగా జరుగుతున్నప్పటికీ పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తూ చూస్తుండిపోతున్నారు. ఈ స్టేషన్ పరిధిలో రేషన్ మాఫియా పెట్రేగిపోతుంది. బాహాటంగానే రేషన్ బియ్యాన్ని పిండి మరలకు తరలించి నూకలగాను, పిండిగాను మార్చి అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. వీటిలో పోలీసులు కూడా మామూలు అందుతున్నాయని రేషన్ డీలర్లు చెబుతున్నారు. అయినప్పటికీ వారిపై ఇంతవరకు ఏ డిపార్టుమెంటు చర్యలు తీసుకోకపోవడం ప్రజలకు అనుమానాలకు తావిస్తోంది. స్టేషన్ కు వచ్చిన ప్రతి కేసులోనూ ఏదో విధంగా ఫిర్యాదుదారుడు దగ్గర నుండి ప్రతివాది నుండి మామూలు గుంజుతూ కాలయాపన చేస్తున్నారని విమర్శలు ప్రజల నుండి వస్తున్నాయి. ముఖ్యంగా త్రీ టౌన్ పరిధిలో గంజాయి విచ్చలవిడిగా అమ్ముతున్నప్పటికీ ఎక్కడా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు వారి వద్ద నుండి కూడా పోలీసులకు మామూలు అందుతున్నాయని విమర్శలు ఉన్నాయి. ఈ స్టేషన్ పరిధిలోనే సుమారు పది లాడ్జ్ లు



వరకు ఉన్నాయి వాటిల్లో విచ్చలవిడిగా వ్యభిచారం జరుగుతున్నప్పటికీ దాడులు చేసిన దాఖలాలే లేవు లాడ్జిలు ఓనర్లు పోలీసులతో ఆర్థిక సంబంధాలు పెట్టుకున్నారనేది ప్రజలు బాహాటంగానే చర్చించుకుంటున్నారు. ముఖ్యంగా పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న లాడ్జిలోనే ఈ అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నప్పటికీ చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారు. తెనాలిలోని బడా బాబులు గౌతమ్ గ్రాండ్ హొటల్లో రూములు బుక్ చేసుకొని పెద్ద ఎత్తున పేకాట ఆడుతున్నారని విమర్శలు ఉన్నాయి. అయినప్పటికీ పోలీసులు చూడటం లేదు మొత్తం మీద పోలీసులు మామూళ్ల మత్తులో జోగుతూ ప్రజలను పట్టించుకోవడంలేదని స్టేషన్ కు వచ్చిన ప్రజలు చర్చించుకుంటున్నారు. సిబ్బంది అధికారులు అంతా కుమ్మక్కై స్వలాభం చూసుకుంటున్నారే కానీ ప్రజలకు న్యాయం చేద్దామనే ఆలోచన లేకపోవడం విచారకరమని వాపోతున్నారు. కేసు ఏదైనా సరే మామూలు చేతిలో పడితేనే ముందు కదులుతుంది లేకపోతే ఎన్నిసార్లు తిరిగిన ఏమీ ఉపయోగం ఉండదనేది బాహాటంగా జరుగుతున్న సత్యం. ఉన్నతాధికారులు ఈ స్టేషన్ పై దృష్టి సారించి సిబ్బందిని గాడిలో పెట్టకపోతే ప్రజల ఇబ్బందులు మరింత పెరిగే అవకాశం ఉందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

# కలిసికట్టుగా పని చేద్దాం...
# ఘన విజయం సాధిద్దాం

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి సత్తా చూపిద్దాం....
- కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి సైనికుల్లా పని చేయాలి...
- పట్టభద్రుల ఓట్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలి
- శుభమస్తు ఫంక్షన్ హాల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికపై ఎన్డీఏ కూటమి సమీక్ష
- హాజరైన జిల్లా ఇన్చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు



**రాజమహేంద్రవరం, అక్టోబర్ 26(ఆంధ్రపత్రిక) :** సాధారణ ఎన్నికల తరువాత జరగబోతున్న ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి కూటమి శ్రేణులు కలిసికట్టుగా పనిచేసి ఘన విజయం సాధించాలని జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, రాష్ట్ర పర్యాటక,సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయం పై రాజమహేంద్రవరం పార్లమెంటు ఎన్ డి ఏ కూటమి నాయకుల సమీక్ష సమావేశం మోరంపూడిలోని గన్నీస్ శుభమస్తు ఫంక్షన్ హాల్ లో జరిగింది. రాజమహేంద్రవరం పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కేఎస్ జవహర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా ఇన్చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తో పాటు ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బత్తుల బలరామకృష్ణ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి,
ముప్పిడి వెంకట్రావు, మద్దిపాటి వెంకట్ రాజు, ఉభయగోదావరి జిల్లాల పార్టీ పరిశీలకులు, శాసనమండలి సభ్యులు రాంభూపాల్ రెడ్డి,ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, బిజెపి జిల్లా అధ్యక్షులు బొమ్ముల దత్తు,జనసేన రాజమహేంద్రవరం ఇన్చార్జ్ అత్తి (అనుశ్రీ) సత్యనారాయణ, సిటీ అధ్యక్షులు వై.శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు.
ఈ సందర్భంగా నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు ఎంత ముఖ్యమో పార్టీ నాయకులు, కార్యకర్తలకు సమన్యాయం చేయడం కూడా అంతే ముఖ్యమని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో 93 శాతం స్ట్రైక్ రేటుతో ఏ విధంగా విజయం సాధించామో అదేవిధంగా ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. వచ్చేనెల ఆరవ తేదీతో పట్టభద్రుల ఓటు నమోదు ముగియనుండడంతో కూటమి శ్రేణులు దానిపై దృష్టి సారించాలన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాది తరువాత జరగబోతున్న ఈ ఎన్నికల్లో అలసత్వం వహించరాదని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు ఈ ఎన్నిక కొలమానం కానుందని పేర్కొన్నారు. ఇప్పటివరకు జరిగిన పట్టభద్రుల ఓటు నమోదు విషయంలో చాలా వెనకబడి ఉన్నామని, ఇకపై అలాంటి నిర్లక్ష్యం జరగరాదని కోరారు. ఈ ఎన్నిక తర్వాత సాగునీటి సంఘాల ఎన్నికలు, సహకార బ్యాంకు ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయని, ఇప్పటినుంచే వాటి కొరకు సంసిద్ధులు కావాలని సూచించారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ కాలపరిమితిని దృష్టిలో పెట్టుకొని సైనికుల్లా పని చేయాలని, పార్టీలో చాలామంది పదవుల కోసం ఆశపడి ఎదురుచూస్తున్నారని, అలాంటి వారందరికీ సమన్యాయం చేసే విధంగా పార్టీ అగ్రనాయకత్వం ఆలోచిస్తుందన్నారు. సాధారణ ఎన్నికలుగా కాకుండా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు విభిన్నంగా ఉంటాయని, అతి విశ్వాసం పనికిరాదని సూచించారు. గత ప్రభుత్వాల హయంలో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పార్టీలు, ప్రతిపక్ష పార్టీలు ఖంగుతిన్న సందర్భాలను కూడా ఆయన గుర్తు చేశారు. కూటమికి చెందిన పేరాబత్తుల రాజశేఖర్ ను గెలిపిస్తే పట్టభద్రులకు న్యాయం జరుగుతుందని, శాసనమండలిలో ఆయన పట్టభద్రుల తరపున గొంతు వినిపించబోతారని అన్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మెగా డీఎస్సీని కూడా ప్రకటించిందని, ఈ విషయాలను పట్టభద్రుల దృష్టికి తీసుకువెళ్లాలని దుర్గేష్ కోరారు. ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ పట్టభద్రుల ఎన్నికల్లో కూటమి అభ్యర్థి రాజశేఖర్ విజయం గురుతరమైన బాధ్యతని, అందుకు ఐకమత్యంగా అందరూ పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, ప్రైవేటు సెక్టార్ల లో పనిచేసే ఉద్యోగస్తులు, సచివాలయాలు, పంచాయతీ కార్యాలయాల్లో పనిచేసే పట్టభద్రులను కలిసి వారి ఓట్లను నమోదు చేసే విధంగా శ్రేణులు పనిచేయాలన్నారు. ఉభయగోదావరి జిల్లాల పార్టీ పరిశీలకులు,ఎమ్మెల్సీ రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటివరకు జరిగిన ఓటు నమోదు చాలా స్వల్పంగా ఉందని, దీనిపై వార్డుల్లో ఉండే కార్యకర్తలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు, ఇప్పటి నుంచి టార్గెట్ పెట్టుకొని పని చేయాలని సూచించారు. ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ముప్పిడి వెంకట్రావు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, రాజానగరం తెదేపా ఇన్చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి, బిజెపి జిల్లా అధ్యక్షులు బొమ్మల దత్తు మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న ఎన్నికల్లో ఘన విజయం సాధించాలంటే ముందుగా పట్టభద్రులను గుర్తించి వారి ఓటును నమోదు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. అన్ని డివిజన్లలో, అన్ని కార్యాలయాలలో ఉన్న పట్టభద్రుల వద్దకు వెళ్లి వారి ఓట్లను నమోదు చేయించే బాధ్యతను ఇప్పటి నుంచే తీసుకోవాలని సూచించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పట్టభద్రులు కూటమివైపే మొగ్గు చూపారని, అందువల్లే ఘన విజయం సాధించగలిగామన్నారు. వచ్చిన కొద్ది రోజుల్లోనే ఇచ్చిన మాటను నిలబెట్టుకుని సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి జరుగుతుందని, ఇది మంచి ప్రభుత్వం అని నిరూపించుకునే తరుణం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు అత్తి సత్యనారాయణ, ప్రియా సౌజన్య, బిజెపి నాయకురాలు హారిక తదితరులు మాట్లాడుతూ కూటమి నిర్ణయించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయమే లక్ష్యంగా పనిచేస్తామని, అందుకు ఓటు నమోదుపై ప్రజల్లోకి వెళతామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం జనసేన బిజెపి పార్టీల సమన్వయకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సాగర్ సిమెంట్స్‌లో
# రక్తదాన శిబిరం

**విద్యార్థులకు స్కాలర్షిప్‌లు పంపిణీ**



**గురజాల, అక్టోబర్ 26 (ఆంధ్ర పత్రిక) :** పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం గామాలపాడు శివారులోని సాగర్ (ఆంధ్ర )సిమెంట్స్ లిమిటెడ్ ప్రాంగణంలో సాగర్ సిమెంట్స్ ఫౌండర్ చైర్మన్ సమ్మిడి వీరా రెడ్డి 90 వ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ వైద్య విధాన పరిషత్, నర్సారావుపేట ఆద్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. సాగర్ గ్రూప్ ప్రెసిడెంట్ గణేష్ రిబ్బన్ కట్ చేసి శిబిరాన్ని ప్రారంభించారు. 100 మంది ఉద్యోగులు, కార్మికులు రక్తదానం చేశారు. రక్తదానం మహాదానం అని మనం ఇచ్చే ప్రతి రక్తపు చుక్క అపదలో ఉన్న వారికి ప్రాణం ఇస్తుందని గ్రూప్ ప్రెసిడెంట్ గణేష్ అన్నారు. రక్తదాన క్యాంపు లో పాల్గొన్న ఆయన సురక్షితమై, నాణ్యమైన రక్తాన్ని అవసరమైనవారికి అందించాల్సి వుంటుందన్నారు, మనందరమూ రక్తాన్ని దానం చేసి ప్రాణాలు కాపాడుదామని కోరారు. ఈ సందర్భంగా రక్త దాతల సేవాభావాన్ని గణేష్ ప్రశంసించారు. క్యాంపులో రక్తదానం చేసిన వారినందరినీ కలిసి ప్రత్యేక ధన్యవదాలు తెలిపారు .ఈ కార్యక్రమంలో ప్లాంట్ హెడ్ సుబ్బా రావు, నరేందర్ రెడ్డి, నవీన్ రెడ్డి, సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు, శంకర్ నారాయణ రెడ్డి, గణేశ్, మనోజ్ కుమార్ రెడ్డి, లక్ష్మీ రెడ్డి, వర్మ, డాక్టర్ రామయ్య,శ్రీనివాస్ రెడ్డి ,ఆంధ్ర ప్రదేశ్ వైద్య విధాన పరిషత్, నరసరావుపేట వైద్యులు డాక్టర్ నీరజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అధేవిదంగా సమ్మిడి వీరారెడ్డి స్మారక స్కాలర్షిప్ లను దుర్గా పబ్లిక్ స్కూల్ తో పాటు దాచేపల్లి మండలం లోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 2023-24 విద్యా సంవత్సరంలో ప్రతిభ చూపిన విద్యార్థి నీ, విధ్యార్థులకు రూ.20,000, 15,000, 10,000 చొప్పున నగదు బహుమతి తో పాటు మెమోంటోలను ఎంఇవో పినాకపాణి, దుర్గా పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ మల్లిఖార్జున శర్మ చేతుల మీదుగా అందజేశారు.



## రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 2500 మంది
# ఉద్యోగులకి న్యాయం చేయాలి

**ఆదివాసి మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తుష్టి జోగారావు**



**కూనవరం, అక్టోబర్ 26(ఆంధ్రపత్రిక) :** డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో గత 17 సంవత్సరాలుగా ఫీల్డ్ లో పనిచేస్తున్న వైద్య మిత్రాలు టీం లీడర్లు జిల్లా మేనేజర్లు ఆఫీస్ అసోసియేట్లు మరియు జిల్లా మానిటరింగ్ యూనిట్ ఉద్యోగులు గా పనిచేస్తున్న వారికి కనీస వేతనాలు కూడా అందడం లేదని గత 17 సంవత్సరాలుగా రాష్ట్ర వ్యాప్తంగా ఈ పథకంలో సుమారు 2500 మంది వరకు ఉద్యోగులు ఉన్నారని వీరందరికీ న్యాయం చేయాలని అన్నారు. విరి సమస్యలు పరిష్కారం దిశగా వెళ్లడం లేదని తక్షణమే వారి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని ఆదివాసి మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తుష్టి జోగారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నాడు ఆయన కూనవరంలో పని చేస్తున్నా డాక్టర్ ఎన్ టి ఆర్ వైద్య సిబ్బందితో సమావేశమై మాట్లాడుతూ డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో గత 17 సంవత్సరాలుగా పనిచేస్తున్న ఉద్యోగులకు కనీస వేతనం కూడా అమలు చేయడం లేదని ఆయన తెలిపారు జరిగిపోయిన కాలంలో ఉద్యోగరీత్యా కొంతమంది ఇప్పటికే రిటైర్మెంట్ అయ్యారని చాలా మంది సిబ్బంది రిటైర్మెంట్ వయసుకు దగ్గరలో ఉన్నారని కనీసం వారికి ఎలాంటి ప్రయోజనాలు కూడా ప్రభుత్వం కల్పించే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పథకంలో పనిచేస్తున్న సిబ్బందికి , కనీసం సమాన పనికి సమాన వేతనం కూడా అందడం లేదని తెలిపారు 17 ఏళ్లుగా అరకొర జీతాలతోనే తమ కుటుంబాలను పోషించుకుంటున్నారని తెలిపారు ప్రభుత్వాలు మారిన ఈ ఉద్యోగులకు ఎలాంటి ప్రయోజనం ఉండడం లేదని తెలియజేశారు ఇప్పటికైనా ప్రభుత్వం డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులకు కనీస వేతనం అమలు చేయడంతో పాటు వారి కనీస డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకాన్ని ఇన్సూరెన్స్ విధానంలోకి మార్పు చేసిన ఈ పథకంలో పని చేస్తున్న ఉద్యోగులుకు 17 సంవత్సరాల సర్వీసుని పరిగణలోకి తీసుకొని కేడర్ కల్పించి సుప్రీం కోర్టు చెప్పిన విధంగా సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించాలని ట్రస్ట్ ఫీల్డ్ సిబ్బందికి నిర్వహించిన వన్ టైం ఎగ్జామును ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఈ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులకు సీనియార్టీ ప్రకారం ప్రమోషన్ కల్పించాలని చనిపోయిన ఉద్యోగులకు 15 లక్షలు ఎక్స్గ్రేషియా ఇవ్వాలని రిటైర్మెంట్ అయిన ఉద్యోగులకు 10 లక్షల గ్రాడ్యుటి ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు ఈ నెల 29 నుంచి తమ డిమాండ్ల పరిష్కారం కోసం ఎన్టీఆర్ వైద్య సేవ పథకం ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు తమ అసోసియేషన్ తరపున పూర్తి మద్దతు ఉంటుందని తక్షణమే ప్రభుత్వం వీరి సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ఉద్యోగులు డి సర్వేశ్వరరావు పి సుహాసిని తదితరులు పాల్గొన్నారు

# ప్రవీణ్ కుమార్ మృతికి కారకులైన ,వైస్ ప్రిన్సిపాల్‌ను ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలి




**అరకులోయ అక్టోబర్ 26 (ఆంధ్ర పత్రిక) :** అల్లూరి సీతారామరాజు జిల్లా అరుకు ఏపీఆర్ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న బోడ్ నాయిక్ ప్రవీణ్ కుమార్ మృతికి కారణమైన వైస్ ప్రిన్సిపల్ ను కఠిన చర్యలు తీసుకొని ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుచేసి అరెస్టు చేయాలి. మృతి చెందిన విద్యార్థి కుటుంబాన్ని ఆదుకోవాలని 10 లక్షల ఎక్స్గ్రేసియా చెల్లించాలని ఆదివాసీ గిరిజన సంఘం ఎస్ ఎఫ్ ఐ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో అరకువేలి మండలం కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ ఎస్ ఎఫ్ ఐ జిల్లా అధ్యక్షులు కార్తీక్ మాట్లాడుతూ.. ముంచంగిపుట్టు మండలం జోలాపుట్టు పంచాయితీ పొలిపుట్ గ్రామస్థులు బోడ్నాయక్. ఈశ్వర్ నీలమ్మ దంపతుల కుమారుడు ప్రవీణ్ కుమార్ అరుకువేలి ఏపీఆర్ ఉన్నత పాఠశాలలో 10 వ తరగతి చదువుతున్నాడు గత వారం రోజుల క్రితం పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్ పై భౌతిక దాడి చేశారని, తల శరీరం పై గట్టిగా కౌకు దెబ్బలు తగలడంతో స్పృహతపి పడిపోవడంతో విషయం తెలుసుకొన్న తల్లి తండ్రుల పాఠశాలకు వెళ్లి గట్టిగా నిలదీయగా అరుకులో వైద్యం అందించి మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్ లో చేర్చారు. ఆరోగ్యం విషమించి శుక్రవారం మరణించారు. ఆశ్రమ పాఠశాలలో తరచు విద్యార్థులు మరణిస్తున్న ఐటీడీఏ అధికారులు జిల్లా అధికారులు రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం చాలా బాధాకరమని విద్యార్థులు చనిపోతున్న కనీసం సమగ్ర విచారణ జరపడం లేదని ఆశ్రమల్లో హెల్త్ అసిస్టెంట్ నియమించాలి, హెల్త్ అసిస్టెంట్ లేకపోవడం వలన అనేకమంది విద్యార్థులు చనిపోతున్న ఆశ్రమ పాఠశాలలో సరైనవి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయకపోవడం బాధాకరం ప్రవీణ్ కుమార్ మృతి గల కారణాలు వెంటనే సమగ్ర విచారణ జరిపించి వైస్ ప్రిన్సిపాల్ పై తక్షణ చర్యలు తీసుకొని అరెస్టు చేయాలని ఆ కుటుంబానికి 10 లక్షల రూపాయలు నష్టపరిహారం అందించాలని కుటుంబానికి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఆశ్రమ విద్యార్థుల మృతిపై అధికారులు రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంపై భవిష్యత్తులో పెద్ద ఉద్యమాన్ని చేపడతామని వారు హెచ్చరించారు నేడు కార్యక్రమంలో ఎస్ ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి జీవన్ కృష జిల్లా నాయకులు ఐస్ బాబు విజయ చ%శీ%దు మృతి చెందిన విద్యార్థి కుటుంబికులు సుబ్బారావు నాగేశ్వరావు మత్యరాజు పరశురాం రామరాజు రాము తదిరులు పాల్గొన్నారు

# ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలతో యువత రాణిస్తే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది..

- ప్రతి విద్యార్థి నైపుణ్యతను పెంచుకొనేందుకు రు.15 వేల రూపాయలు ఫీజు భవనా చారిటబుల్ ట్రస్ట్ తరపున చెల్లించడానికి సిద్ధంగా ఉన్నాను.
- సిటీ శాసన సభ్యులు ఆదిరెడ్డి వాసు




**రాజమహేంద్రవరం అక్టోబర్ 26 (ఆంధ్రపత్రిక) :** ఏ దేశానికైనా, రాష్ట్రానికైనా వెన్నెముక.. యువత అని, యువతీ, యువకులు బాగుంటేనే... ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలతో రాణిస్తేనే దేశం, రాష్ట్రం బాగుంటాయని సిటీ శాసన సభ్యులు ఆదిరెడ్డి వాసు పేర్కొన్నారు. శనివారం స్థానిక ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాకు ముఖ్య అతిధిగా శాసన సభ్యులు ఆదిరెడ్డి వాసు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇక్కడికి విచ్చేసిన అధికారులు, నాయకులు, యువకులందరికీ ముందుగా ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ గత 5 ఏళ్లలో ఆంధ్రప్రదేశ్ యువత ఏ విధంగా అల్లాడిపోయారో మనమంతా చూశామన్నారు. ఒకవైపు ఉద్యోగాలు లేవు. మరోవైపు మనల్ని పక్కదారి పట్టించి, మన భవిష్యత్తును నాశనం చేసే గంజాయి, డగ్స్, ఇతర మత్తు పదార్థాలు. వీటితోనే యువత భవిష్యత్తు, జీవితాలు నాశనం అయిపోయాయి. చాలా కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. దేవుడి ఆశీర్వాదం, మీ అందరి ప్రేమాభిమానాలు.. యువత, మహిళలు, రైతులు, ఉద్యోగులు... ఇలా అన్ని వర్గాల కోసం ఆలోచించే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. నన్ను కూడా రాజమండ్రి చరిత్రలో ఎన్నడూ ఊహించని విధంగా భారీ మెజార్టీతో గెలిపించారని పేర్కొన్నారు. ఇంత చేసిన మీకు.. ఈరోజు ఇలా ఎమ్మెల్యేగా మీ అందరి మధ్య పుట్టిన రోజు జరుపుకొనే విధంగా అతి పెద్ద గిఫ్ట్ ఇచ్చిన మీకు... తిరిగి నేను కూడా గిఫ్ట్ ఇవ్వాలని భావించే.. ఈరోజు ఈ మెగా జాబ్ మేళా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

దాదాపు 70కి పైగా కంపెనీలు మీ క్వాలిఫికేషన్ ఆధారంగా తగిన జీతంతో, మీకు సరిపడా ఉద్యోగాలు ఇవ్వడానికే ఇక్కడకు వచ్చాయన్నారు. ఇక్కడికి వచ్చిన మీరందరూ కూడా ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకొని, మంచి ప్యాకేజీతో ఉన్నత ఉద్యోగాలు సాధించాలని, మీ జీవితంలో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు. నా ఆఫీస్ కు కనీసం 40, 50 మంది ఉద్యోగాల కోసం వస్తుంటారని, అందులో చాలా మందిని కొన్ని కంపెనీలకు పంపించడం జరిగిందన్నారు. అయితే చాలా మందిని తిరిగి వచ్చేస్తున్నారు దీనికి ప్రధాన కారణం టెక్నికల్ స్కిల్స్ లేకపోవడమే , స్కిల్స్ లేని వారికి సాఫ్ట్ వేర్ ట్రైనింగ్ లో ఎంతో అనుభవం ఉన్న అమరావతి సొల్యూషన్స్ వారితో మాట్లాడటం జరిగిందని, వారు కూడా ఎంతో ముందుకు వచ్చి, ప్రతీ 3 నెలలకు 100 మంది చొప్పున స్కిల్ ట్రైనింగ్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. అయితే... దీనికి 3 నెలలకు అయ్యే ఖర్చు.. 20 వేల రూపాయలు. నా వంతుగా, ఎవరైతే మంచి ప్యాకేజీతో ఉద్యోగాలు సాధించాలనుకొని.. స్కిల్ ట్రైనింగ్ కోర్సు చేయాలని వస్తారో... వారి తరపున నా సాయంగా ప్రతి వ్యక్తికీ 15 వేల రూపాయలు ఫీజు భవనా చారిటబుల్ ట్రస్ట్ తరపున చెల్లించడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. మిగతా 5వేలు మాత్రమే ఆ విద్యార్థి చెల్లించుకోవాలని కనుక.. ఎవరైతే ఈ స్కిల్ ట్రైనింగ్ చెయ్యాలని అనుకుంటున్నారో... వారు నేరుగా నన్నే కలవొచ్చు. లేదా మా ఆఫీస్ స్టాఫ్ ని కలిసి, మీ వివరాలను వారికి అందిస్తే... మేం చెల్లిస్తున్న 15వేల రూపాయల ఫీజు తగ్గించే విధంగా లెటర్ హెడ్ పైనే మీకు రిఫరెన్స్ ఇవ్వడం జరుగుతుందని శాసన సభ్యులు పేర్కొన్నారు. కేవలం రాజమండ్రి యువతే కాకుండా.. చదువుకోవాలి, మంచి ఉద్యోగం తెచ్చుకోవాలని ఎవరు వచ్చినా నా వంతుగా సహకారం అందిస్తానన్నారు. ఈ అవకాశాన్ని ఎవరైతే ఆసక్తి, అర్హత ఉన్నవారు ఉంటారో.. వారంతా సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నానన్నారు. అలాగే... ఇక్కడితో అయిపోయిందని ఎవరూ అనుకోవద్దు. మీకోసం, మీ భవిష్యత్తు కోసం ఇటువంటి మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తానన్నారు. మీ వంతుగా.. మీరు కూడా ఉద్యోగాలు సాధించడమే కాదు.. మీ కంపెనీకి, మీ తల్లిదండ్రులకు, మన రాజమండ్రి నియోజకవర్గానికి కూడా మంచి పేరు తెచ్చే విధంగా మంచిగా ఉద్యోగాలు కొనసాగించాలని సూచిస్తున్నానన్నారు.

మీరు ఎంత ఉన్నత స్థానంలో ఉంటే.. మీ అన్నగా, మీ సోదరుడిగా నేను కూడా అంతే సంతోషిస్తానని గుర్తుంచుకోవాల్సిందిగా కోరుతున్నానన్నారు. మంచిగా ఇంటర్వ్యూలు అటెంప్ట్ చెయ్యండి. మంచి ఉద్యోగాలు సాధించండి. విష్ యూ ఆల్ ది బెస్ట్ అని యువతని శాసనసభ్యులు ఆదిరెడ్డి వాసు ఉత్సాహపరిచారు.



## ఆతవ రోడ్డు పరిస్థితి ఇంతేనా?

# ఎమ్మెల్యే గారూ!

- అప్పట్లో వైసీపీ పాలకులు పట్టించుకోలేదు
- కూటమి ప్రభుత్వమైనా తారు రోడ్డును నిర్మించండి
- విజ్ఞప్తి చేస్తున్న ఆతవ గ్రామస్తులు



**వేపాడ,అక్టోబర్,26(ఆంధ్రపత్రిక):** -ప్రభుత్వాలు నేతలు మారినా ప్రజల తలరాతలు మాత్రం మారలేదు.ఏ పార్టీ నేతలైనా అధికారం ఎలా దక్కించుకోవాలన్న ధ్యేసే తప్ప ప్రజలకు ఏవిధంగా సేవలందించాలన్న తపన ఎవరికీ లేదు.అందుకే మండలంలో ఎక్కడి సమస్యలు అక్కడే అన్న చందంగా ఉన్నప్పటికీ ఎన్నికైన శాసనసభ్యులు, ఎంపీలు అధికారంకోసం ఆరాటపడడం తప్ప ప్రజలకు చేసే సేవలు శూన్యమేనని చెప్పకతప్పదు.వివరాల్లోకి వెళ్తే మండలంలోని ఆతవ తారు రోడ్డును అప్పటి, ఇప్పటి ఎమ్మెల్యే కోళ్ళ లలితకుమారి నిర్మింప జేసారు.ఆమె నిధులు మంజూరు చేయించి తారు రోడ్డును నిర్మింపజేసినప్పటికి సంబంధిత కాంట్రాక్టర్ చేతి వాటం చూపడం వల్ల ఈ రోడ్డు త్వరితగతిన శిథిలావస్థకు చేరుకుంది.టీడీపీ ఓటమి పాలై వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటికీ ఏ పార్టీ నేతలు రోడ్డు గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. మరో ఆరేడు నెలల్లో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అప్పటి ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆతవ రోడ్డుపై దృష్టి సారించగా శిథిలమైన రోడ్డును తారు రోడ్డుగా మార్చేందుకు శ్రీకారం చుట్టారు.సంబంధిత కాంట్రాక్టర్ మెటల్ లేయర్ వేసి తారురోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించకుండా చేతులు దులుపుకున్నారు.ఆ తర్వాత ఎన్నికలు రావడం టీడీపీ కూటమి అధికారంలోకి రావడం ఎమ్మెల్యేగా కోళ్ళ లలితకుమారి గెలుపొందడం చకచకా జరిగిపోయింది కానీ ఆతవ రోడ్డు నిర్మాణం పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది.ప్రస్తుతం స్థానిక ఎమ్మెల్యేగా అధికారంలో ఉన్న లలితకుమారి కాస్త చొరవ చూపి ఆతవ మెటల్ రోడ్డును తారు రోడ్డుగా మార్చేందుకు నిధులు కేటాయించి శరవేగంగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ప్రభుత్వ పాఠశాలలను

# సందర్శించిన ఏంఈఓలు

### పలు పాఠశాల రికార్డులు పరిశీలన



**వేపాడ, అక్టోబర్, 26 (ఆంధ్రపత్రిక) :** మండలంలోని పాటూరు,వీలుపర్తి గ్రామాల్లోని పాఠశాలలను మండల విద్యాశాఖ అధికారులు జి. జగదీశ్వరరావు, వి. బాలభాస్కర రాములు సందర్శించారు.పాఠశాలల్లోని విద్యార్థుల సామర్థ్యలను పరిశీలించారు.అలాగే కిచెన్ గార్డిన్‌ను పరిశీలించారు. టాయిలెట్స్‌ను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలన్నారు.అదేవిదంగా వెల్దాం పాఠశాల వార్షిక తనిఖీని నిర్వహించారు. ఎం.డి.ఎం పరిసర ప్రాంతాలను,తరగతిగదిలో టి.ఎల్.ఎం మొదలైనవి పరిశీలించడం జరిగింది. ఉపాధ్యాయులతో మోడల్ లెస్సన్ చెప్పించడం జరిగింది.ప్రధానోపాధ్యాయులు డెక్కా అర్జున్ గణిత పాఠ్యంశాన్ని బోధించడం జరిగింది.సహ ఉపాధ్యాయరాలు నవుడు కుమారి 2వ తరగతి విద్యార్థులకు సబ్బు బిళ్ళ అనే మోడల్ లెస్సన్ చెప్పడం జరిగింది.పాఠశాల రికార్థులను పరిశీలించారు.ఎం.డి.ఎం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకానికి సంబంధించి రికార్థులను అప్డేట్ చేయడం జరిగింది.అదే పాఠశాలలో ఉపాధ్యారాలుగా పనిచేస్తున్న రమాకుమారి పిల్లలు అదే పాఠశాలలో 1వ తరగతి,5వ తరగతి చదవడం శుభసూచికమని ఆమెను అభినందించారు.పాఠశాల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

## పరిసరాలు పరిశుభ్రత తోటే

# ప్రజలకు ఆరోగ్యం

### పంచాయతీ అధికారిని శిరీష




**అనకాపల్లి అక్టోబర్ 26 (ఆంధ్రపత్రిక) :** గ్రామపంచాయతీ తుమ్మపాల గ్రామంలో మెగా క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం పెద్ద ఎత్తున శనివారం జరిగింది ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శిరీష మేడం పాల్గొన్నారు సుమారుగా 100 మంది స్వీపర్లు మూడు సచివాల ముల సిబ్బంది గ్రామంలో ఉన్న అన్ని 18 వార్డులు నుంచి కూడా శానిటేషన్ కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామంలో ఉన్న ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు ఇటువంటి కార్యక్రమము చేయడం వలన గ్రామ ప్రజల్లో అవేర్నెస్ రావడానికి అవకాశం ఉంది చెత్త చదారాలను గ్రామం నలుమూలల నుండి సేకరించి డంపింగ్ యార్డ్ కు తరలించడం జరిగింది మెయిన్ రోడ్డు కూడా చాలా క్లీన్ గా చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిపిఓ మేడం శిరీష రాణి , నాగలక్ష్మి , ఈవో పి .ఆర్ .ఆర్ .డి, ప్రసాద్, గ్రామ సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు , వార్డ్ మెంబర్లు ఎంపీటీసీలు, ఈవో సత్య ప్రసాద్ ,కోటమీ నాయకులు పాల్గొన్నారు

# భారీ క్వారీ లారీలతో పొంచి ఉన్న ప్రమాదాలు

- నిషేధం విధించినా చిన్నచిన్న రోడ్లపై తిరుగుతున్న హైవే వాహనాలు
- భారీ వాహనాలతో దుమ్మెత్తి పోస్తున్న ధూళి
- రాకపోకల్లో నరకం చూస్తున్న పలు గ్రామాల ప్రజలు




**వేపాడ,అక్టోబర్,26 (ఆంధ్ర పత్రిక) :** గ్రామీణ ప్రాంతాల్లోని చిన్న చిన్న రోడ్లపై పెద్ద పెద్ద క్వారీ లారీలు తిరగకూడదని నిషేధం విధించినా లారీల యజమానులు నిబంధనలను పట్టించుకోవడం లేదని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.ప్రమాదాలు పొంచి ఉండడమే కాకుండా ధూళి, దుమ్ము విరజల్లుతూ ఎదురెదురుగా వస్తున్న వాహనాలకు చోటివ్వడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. ఈ లారీల వల్ల విరజిల్లుతున్న దుమ్ము,ధూళితో రోడ్లను ఆనుకొని ఉన్న పలు గ్రామాల ప్రజలు రోగాల బారిన పడుతూ ఆస్పత్రుల పాలవుతున్నారు.అలాగే సోంపురం- ఆనందపురం ప్రధాన రహదారి విస్తరణ పనులు పూర్తి కాకపోవడం వల్ల నీలకంఠ రాజపురం,పెదగుడి పాల,భర్తవానిపాలెం, వేపాడ,వల్లంపూడి,ఆకుల సీతంపేట, జగ్గయ్యపేట,అరిగిపాలెం,సోంపురం తదితర గ్రామాల ప్రజలు నిత్యం ఈ క్వారీ లారీల రాకపోకల కారణంగా నరకం చూస్తున్నారు. అయినప్పటికీ రోడ్డు పనులైనా పూర్తి చేయరు లేదా నిబంధనల ప్రకారం క్వారిలకు చెందిన భారీ లారీలనైనా నిషేధించరు.ఈ క్వారీ లారీల వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నప్పటికి పోలీసులు కూడా ఎటువంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు,క్వారీ లారీల యజమానులు స్పందించి నిబంధనల మేరకు చిన్న చిన్న లారీలను మాత్రమే అనుమతించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

### క్వారీ లారీల వల్ల ఇబ్బందులు పడుతున్నదివ్యాంగులు:-

చిన్న,చిన్న రోడ్లపై అతి వేగంతో తిరుగుతున్న క్వారీ లారీల వల్ల దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారని ఏపీ దివ్యాంగుల జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా మధు ఆవేదన వ్యక్తం చేశారు.వారి ఇష్టారాజ్యంగా వాహనాలను నడపడం వల్ల నిత్యం దుమ్ము ధూళి పొగ మాదిరిగా కమ్ముకుంటూ దారి కూడా కనిపించని పరిస్థితి నెలకొందనీ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు పోలీసులు స్పందించి భారీ లారీలను నిషేధించాలని కోలా మధు డిమాండ్ చేశారు.



## జనరిక్ మందుల దుకాణాలకు వేలం తిరిగి నిర్వహించాలి



**కాకినాడ, అక్టోబర్ 26 (ఆంధ్రపత్రిక):** జిల్లా సమాఖ్య నిర్వహించిన జనరిక్ మందుల దుకాణాల వేలంలో స్పష్టత కొరవడిందని అందువల్ల తిరిగి వాటికి వేలంపాట నిర్వహించాలని పలువురు పాటదారులు విజ్ఞప్తి చేశారు. ఎటువంటి నియమ నిబంధనలు లేకుండా పిలిచారని దీన్ని మరోసారి నిర్వహించాలని వారు కోరారు. శనివారం కాకినాడలోని డిఆర్డిఏ కార్యాలయంలో కాకినాడ జిల్లాలో కాకినాడ, పిఠాపురం, పత్తిపాడు ఆసుపత్రులలో ఉన్న జనరిక్ మందుల దుకాణాలకు టెండర్లను నిర్వహించారు. ఈ టెండర్లలో కాకినాడ దుకాణానికి 14, ప్రత్తిపాడుకు మూడు, తునికి ఏడు టెండర్లు రాగా మరో 28 టెండర్లు నిబంధనలకు విరుద్ధంగా ఉండడంతో తిరస్కరించారు. మూడేళ్ల కాల పరిమితిగాను కాకినాడకు మూడు లక్షల 45 వేల రూపాయలు, ప్రత్తిపాడుకు 21,699, తునికి 1,21, 999 రూపాయలకు పాటదారులు ఆయా దుకాణాలను దక్కించుకున్నారు. ఈ వేలం పాటలో పాల్గొన్న పాటదారులు పలు సన్యాసులు, విధానాలు, సందేహాలను అడగగా దీనిపై అధికారులు వారికి సరైన రీతిలో సమాధానం ఇవ్వలేకపోయారు. వేలం పాటలో హెచ్చుపాటకు పాడి దక్కించుకోవడం తగదని వారు చెప్పారు. పేదవాళ్ళకు తక్కువ ధరకే విక్రయించాల్సిన మందులను పాటల వల్ల అధిక రేట్లకు విక్రయం చేయాల్సిన పరిస్థితి వస్తుందని వారు చెప్పారు. తామడిన సందేహాలకు, సమాధానాలు ఇవ్వాలని పాటదారులు పట్టుబడ్డగా ఈ విషయాన్ని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్తామని సమాఖ్య అధికారులు చెప్పారు. అంతవరకు దుకాణాలు ఎవరికి కేటాయించవద్దని తిరిగి మరిన్ని పూర్తి వివరాలతో టెండర్లు పున:పిలవాలని పాటదారులు సూచించారు. ఈ కార్యక్రమంలో పాటదారులు చోడిశెట్టి కాశీ విశ్వేశ్వరరావు, మాదేపల్లి శ్రీనివాసరావు, జిల్లా సమాఖ్య కార్యదర్శి జి సంధ్యారాణి, ప్రాజెక్టు మేనేజర్ ఎంఎం జిలానీ, డీపీఎంలు టి బాబూరావు, విబిఆర్ రాయ్, టీ భరత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రోడ్ సేఫ్టీ సభ్యురాలిగా బోడపాటి కాంతం



**కాకినాడ అక్టోబర్ 26 (ఆంధ్రపత్రిక) :** కాకినాడ జిల్లా రోడ్డు సేఫ్టీ (రహదారి భద్రత కమిటీ)జిల్లా సభ్యురాలిగా తుని పట్టణానికి చెందిన బోడపాటి కాంతం నియమితులయ్యారు. కాంతంను సభ్యురాలుగా నియమిస్తూ రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ ఉత్తర్వులను జారీ చేసింది. శనివారం కాంతం రోడ్డు రవాణా శాఖ కార్యాలయాన్ని సందర్శించి అక్కడున్న అధికారులను పరిచయం చేసుకున్నారు.ఈ సందర్భంగా కాంతం మాట్లాడుతూ రోడ్డు భద్రత, ప్రమాదాల చర్యలపై ఏడుగురితో కూడిన ఒక కమిటీ ప్రభుత్వం నియమించిందని చెప్పారు. రోడ్డు భద్రతపై అవగాహన ప్రమాదాలను జరగకుండా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అలాగే రోడ్డు ప్రమాదాలకు గురైన వారు, చనిపోయిన వారి కుటుంబాలకు సకాలంలో పరిహారం అందేలా ఈ కమిటీ తమ విధులను నిర్వహిస్తుందని చెప్పారు. రోడ్డు ప్రమాదంలో మరణిస్తే 2 లక్షలు, ప్రమాదం జరిగితే 50వేల రూపాయలు పరిహారాన్ని ప్రభుత్వం ఇస్తుందని దాన్ని బాధితులు వారి కుటుంబాల వారు సద్వినియోగం చేసుకోవాలని కాంతం కోరారు. కాంతం వెంట బి నాగ శ్రీవేణి, బి హిమకాంత్, కె లోహిత్ ధనరాజ్, కే వేదకాంత్, మర్రి సుజాత, పెసింగి లక్ష్మి, రమాదేవి, భవాని, సత్య తదితరులు ఉన్నారు.

## క్లాప్ డ్రైవర్ల సమస్యల పోరాటం ఉధృతం




**కాకినాడ, అక్టోబర్ 26 (ఆంధ్రపత్రిక) :** కాకినాడ నగర పరిధిలో పనిచేస్తున్న క్లాప్ వాహన డ్రైవర్ల మూడు నెలల బకాయి జీతాలు చెల్లించాలని కోరుతూ శనివారం మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు కాకినాడ జిల్లా అధ్యక్షులు దువ్వా శేష బాబ్జి, సిఐటియు నగర కన్వీనర్ మలకా వెంకటరమణ, కో కన్వీనర్ పలివెల వీరబాబులు మాట్లాడుతూ నగరంలో తడి చెత్త, పొడి చెత్త సేకరణ చేసే వాహనాలు రెండు రోజుల నుంచి ఆగిపోయినా మున్సిపల్ అధికారులు నుంచి ఏ విధమైన స్పందన లేదన్నారు. తక్షణమే మూడు నెలల బకాయి జీతాలు చెల్లించాలని, అదేవిధంగా సంవత్సర కాలం నుంచి కార్మికుల జీతాల నుంచి కట్ చేసుకున్న పీఎఫ్ సొమ్మును కార్మికులు ఖాతాకు జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో క్లాప్ వాహన డ్రైవర్స్ యూనియన్ నాయకులు సంతోష్, ఇస్మాయిల్, గంగాధర్, దుర్గాప్రసాద్, కృష్ణమూర్తి, రాజు, కే రాము, డి వీరబాబు, శివ, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి బ్యాట్మెంటన్ పోటీలకు ఎంపికైన

# నారాయణ కేంబ్రిడ్జి విద్యార్థులు

### విద్యార్థులను అభినందించిన ప్రిన్సిపాల్ ప్రసాద్



**వేపాడ, అక్టోబర్, 26 (ఆంధ్రపత్రిక) :** నియోజ కవర్గంలోని శృంగవరపుకోట పట్టణంలో గల నారాయణ కేంబ్రిడ్జి పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి బ్యాట్మెంటన్ పోటీ లకు ఎంపికయ్యారు .నారా యణ కేంబ్రిడ్జి పాఠశాల విద్యార్థులు విజయనగరం లోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో జరిగిన బ్యాట్మెంటన్ పోటీల లో జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎన్ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.అండర్ (14)విభాగంలో కే.అభిషేక్ రాజ్, ఎమ్.పూర్ణ చంద్ర శేఖర్,అలాగే అండర్ (17)విభాగంలో ఎమ్.తుంగ విద్య వీరు లు బ్యాట్మెంటన్లో ద్వితీయ స్థానం సాధించడంతో పాటు ఈ నెల 28,29,30, తేదీలలో అంబేద్కర్ కోనసీమ జిల్లా మల్కిపురంలో రాష్ట్రస్థాయి బ్యాట్మెంటన్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ తో పాటు ఏజిఎం శివరాం,రీజనల్ ఇంచార్జ్ రవికుమార్,పాఠశాల ఎ.జి.ఎమ్.శ్రీనివాసరావు,కో -ఆర్డినేటర్స్, ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, అభినందించారు.అలాగే పాఠశాల క్రీడాశిక్షకులు,వి.మురళిను సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

## టిడిపి సభ్యత్వంతో ప్రతి ఒక్కరికీ కొండంత అండ

### టిడిపి సభ్యత్వ నమోదు ప్రారంభించిన జ్యోతుల నవీన్



**గోకవరం, అక్టోబర్ 26 (ఆంధ్రపత్రిక) :** ప్రతి ఒక్కరూ టిడిపి సభ్యత్వం నమోదు చేసుకోవాలని తద్వారా కుటుంబానికి అండగా ఉంటుందని కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ జడ్పీ చైర్మన్ జ్యోతుల నవీన్ కుమార్ అన్నారు. గోకవరం మండలంలో తంటి కొండ, గాదెలపాలెం, ఇటుకాయలపల్లి కృష్ణునిపాలెం గ్రామాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. తంటికొండ గౌరీదేవి ఫంక్షన్ హాల్లో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జ్యోతుల నవీన్ ప్రారంభించారు. ముందుగా వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి బత్తుల సత్తిబాబుకు మొదటి సభ్యత్వం అందించారు. ఈసందర్భంగా నవీన్ మాట్లాడుతూ, గత తెలుగుదేశం ప్రభుత్వంలో ఎవరికైనా ప్రమాదం జరిగితే ఆకుటుంబానికి అండగా చంద్రన్న బీమా ఐదు లక్షలు సభ్యత్వం తీసుకున్న వారికి రెండు లక్షలు అందించే వారని వైసీపీ ప్రభుత్వంలో ఎవరికీ బీమా సౌకర్యం కల్పించలేదని మళ్లీ మన ప్రభుత్వంలో టిడిపి సభ్యత్వం తీసుకున్న వారికి 5 లక్షల రూపాయలు బీమా సౌకర్యం కల్పిస్తుందని చంద్రన్న బీమా కూడా తొందరలోనే అమలు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ అందిస్తున్న పెళ్ళికానుకకు గ్రామాల్లో అందరూ సహకరించి, నిబంధనలు అందరికీ తెలియజేయాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు అభ్యర్థిని ప్రకటించడంలో జ్యోతుల నెహ్రూ కీలకపాత్ర పోషించారని మనందరం కష్టపడి పట్టబద్దుల ఓట్లు నమోదు చేయించి అభ్యర్థి రాజశేఖర్ గెలుపుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎస్ వి ఎస్ అప్పలరాజు, కన్నబాబు, భరత్ కుమార్, మంగరౌతు రామకృష్ణ, మారిశెట్టి భద్రం, జనపరెడ్డి బాబు, పాలూరి బోసుబాబు, జీను మణిబాబు, బదిరెడ్డి అచ్చన్న దొర, బదిరెడ్డి బాబి, పెద్దాడ వెంకన్న దొర, గునిపే భరత్, బదిరెడ్డి నాగ సూర్య సత్యనారాయణ, నాగం వెంకటపతి, మలిరెడ్డి సిరి, గెద్దం బాబు, సాలాపు నలమహారాజు, గల్లా రాము, మండిగ గంగాధర్, బదిరెడ్డి రవి, కొంగరపురాజు నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



# జిల్లాను ప్రగతిపథంలో నడపడంలో ప్రజా ప్రతినిధులు, అధికారుల మధ్య సమన్వయం, పరస్పర అవగాహన అవసరం



**రాబోయే వారం రోజుల్లో మార్కెట్లో ఇసుక డిమాండ్ మేరకు సప్లై పెంచే విధంగా చర్యలు చేపట్టాలి....**

**ఆర్ అండ్ బి ద్వారా చేపట్టిన రహదారి అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి...**

**పంచాయతీరాజ్ పల్లె పండుగ పనులను సంక్రాంతి లాగా పూర్తి చేయాలి .....**

**ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని ప్రజా ప్రతినిధుల సమన్వయంతో నిర్వహించాలి.....**

**పోలవరం ప్రాజెక్ట్ క్యాపర్ డ్యాం డయాఫ్రమ్ వాల్ ఎర్త్ కమ్ డయా ఫ్రమ్ వాల్ పనులను సమాంతరంగా చేపడతాం....**

**గత ఐదేళ్లలో జల వనరుల శాఖ ద్వారా చేపట్టే నిర్వహణ పనులకు నిధులు లేమితో పకృతి విపత్తులను ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది.....**

**జిల్లా ఇన్చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు**







**రాజమహేంద్రవరం, అక్టోబర్ 26 (ఆంధ్రపత్రిక) :** తూర్పు గోదావరి జిల్లాను ప్రగతిపథంలో నడపడంలో ప్రజా ప్రతినిధులు, అధికారుల మధ్య సమన్వయం, పరస్పర అవగాహన కలిగి ఉండడం ద్వారా సాధ్యం అవుతుందని అందుకు ప్రతి ఒక్కరి సహకారం ఎంతో అవసరమని జిల్లా ఇంఛార్జి మంత్రి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా ఇన్చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, జిల్లా మంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి, ఎస్పీ డి. నరసింహ కిషోర్,శాసనసభ్యుల తో కలిసి జిల్లాస్థాయి అధికారులతో జిల్లా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలుపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ జిల్లాలో వివిధ సమస్యలపై చర్చించి వాటిని పరిష్కరించే దిశగా జిల్లా స్థాయి తొలి సమావేశం నిలిచిందని పేర్కొన్నారు. ఇసుకను అందుబాటులో ఉండేలా అన్ని చర్యలు తీసుకునేలా, ఈ సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. ప్రజలకు ఇసుకను అందుబాటులొ ఉండే విధంగా ప్రజా ప్రతినిధులు చొరవ చూపాలని, ఈ విషయంలో అధికారులు మరింత సమర్థవంతంగా పనితీరు చూపడం ముఖ్యం అన్నారు. గత ప్రభుత్వం లో డీసెల్ టేషన్ వద్ద టన్ను ధర రు. 680రూపాయలు ఉంటే, రు. 228 రూపాయలకి అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని ఇందులో రు. 198 రూపాయలు బోట్స్ మెన్ సొసైటీలకే అందిస్తున్నామన్నారు. స్టాక్ యార్డ్ వద్ద గతంలో యూనిట్ ధర రు. 475 లు ఉంటే ఇప్పుడు రు. 145 కే అందుబాటులోకి తీసుకుని వస్తున్నట్లు తెలిపారు. మరో వారం రోజుల్లో పూర్తిస్థాయిలో ఓపెన్ రీఛార్జ్ ప్రారంభించి డిమాండ్ కు తగ్గ సప్లై అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని అన్నారు. ఇసుక సరఫరాలో, రవాణా లో ప్రభుత్వానికి ఎటువంటి చెడ్డపేరు రాకుండా ప్రజా ప్రతినిధులు కూడా చొరవ చూపి, మెరుగైన సూచనలతో ముందుకు రావాలని మంత్రి రామానాయుడు విజ్ఞప్తి చేశారు. ట్రాక్టర్, ఎడ్లబండ్లు ద్వారా సొంత అవసరాల కోసం వాడుకుంటే ఎటువంటి అభ్యంతరం లేదని, విక్రయాలు జరిపిన , లారీలకి చేరవేసినా, అటువంటి వారి విషయంలో ఉపేక్షించరాదని మంత్రి స్పష్టం చేశారు. ఆ మేరకు ప్రజా ప్రతినిధులు కూడా అవగాహనా పెంచాల్సి ఉంటుందన్నారు. రాబోయే వారం, పది రోజుల్లో మార్కెట్లో ఇసుక డిమాండ్ మేరకు సప్లై పెంచే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులు సూచించారు.

ఆర్ అండ్ బి రహదారుల మరమ్మత్తులు పనులు చేపట్టి దిశలో చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. పంచాయతి రాజ్ ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో పెద్ద ఎత్తున గ్రామస్థాయి రహదారుల అభివృద్ధి కార్యక్రమాలకు రు. 4500 కోట్ల రూపాయలతో చేపట్టిన పల్లె పండుగ పనులను సంక్రాంతి లోగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం ఎత్తిపోతల పథకాన్ని నిర్లక్ష్యం చేసిందన్నారు. రాష్ట్రంలో 1080 ఎత్తిపోతల పథకాలు ఉంటే, గత ఐదేళ్ళ పరిపాలన లో 450 ఎత్తి పోతల పథకాలు మూత పడడం జరిగిందని, దీనివలన సుమారు 3 లక్షల ఎకరాల ఆయకట్టు బీడుగా మారిందని మంత్రి పేర్కొన్నారు. వాటికీ పునరుజ్జీవనం చేసేందుకు ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందనీ తెలిపారు. వాటిని పనిచేసే స్థితికి తీసుకుని రావడం, తదుపరి ఏజెన్సీ ఆధ్వర్యంలో 10 ఏళ్ల పాటు నిర్వహణా చేపట్టే ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. పోలవరం ప్రాజెక్ట్ క్యాపర్ డ్యాం నిర్మాణం పూర్తి గా దెబ్బతిందని, డయాఫ్రమ్ వ్యాల్ పనులతో పాటు సమాంతరంగా ఎర్త్ కమ్ డయా ఫ్రమ్ పనులని చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. నవంబర్ మొదటి వారంలో నిపుణులతో వర్క్ షాప్ నిర్వహించి వారి సూచనల మేరకు జనవరి నుంచి పనులు ప్రారంభించడం జరుగుతుందని పేర్కొన్నారు. గత ఐదేళ్ల పాలనలో జల వనరుల శాఖ కు సంబంధించిన పనులలో నిర్వహణ లేక 20 సంవత్సరాలు వెనుకబడిందన్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రాజెక్టులకు మెయింటినెన్స్ గా రు. 980 కోట్ల రూపాయలు అవసరం కాగా గత ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం రు. 270 కోట్ల రూపాయలు మేర మాత్రమే ఖర్చు చేయడం వలన మొన్న వచ్చిన భారీ వర్షాలు వరదల కారణంగా నష్టాన్ని చవిచూసామన్నారు. తూర్పు, పశ్చిమ గోదావరీ జిల్లాలు ప్రశాంతతకు మారుపేరు అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పలు సందర్భాల్లో పేర్కొనడం జరిగిందని, అటువంటి తూర్పు గోదావరి జిల్లా ఇంఛార్జి మంత్రి గా రావడం ఎంతో సంతోషాన్ని కలిగించిందని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. మనందరం కలిసి పనిచేయడం ద్వారా జిల్లాను అభివృద్ధి పదంలో ముందుకు తీసుకు వెళదామని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఇక్కడ ఎంతో రాజకీయ విలువలు కలిగిన, అనుభవజ్ఞులైన ప్రజా ప్రతినిధులు ఉండడమే కాకుండా, అపార అనుభవం కలిగిన అధికారులు కూడా ఉన్నట్లు తెలిపారు. గతంలో పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టరు గా పనిచేసిన కలెక్టరు ప్రశాంతి ఇప్పుడు తూర్పు గోదావరి జిల్లాగా రావడం ఒక మంచి అధికారిగా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్ళు వ్యవస్థలో నిర్వీర్యం చేసిన సందర్భాలను అధికారులుగా మీరు చవి చూసారన్నారు. అందులో కొందరు అధికారులు కూడా భాగస్వామ్యం అయి ప్రజలను ఇబ్బందులకు గురి చెయ్యడం తో పాటుగా వారు కూడా ఇబ్బందులకు గురి అయిన ఘటనలను మనం చూసామన్నారు. ప్రజా సంక్షేమం కోసం ఎన్డీఏ కూటమి ప్రభుత్వం నిర్దేశించుకున్న ప్రాధాన్యత కార్యక్రమాలను సమర్థతతో నిర్వర్తించడం లో అధికారులు భాగస్వామ్యం కావాలని కోరారు.వ్యవసాయ శాఖపై సమీక్షిస్తూ.. వ్యవసాయ శాఖ సమీక్ష లో కౌలు రైతులకు రుణ సౌకర్యం కల్పించడం మరింత మంది రైతులకు సాగు కార్డులు ఇవ్వాల్సి ఉందన్నారు. వాస్తవంగా వ్యవసాయం చేసే రైతులలో 70 శాతం మంది కౌలు రైతులు ఉన్నారు. ఆమేరకు రుణాలు ఇచ్చేందుకు అధికారులు చర్యలను తీసుకోవాలి. డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింతగా క్షేత్ర స్థాయిలోకి తీసుకొని వెళ్లాలని సూచించారు.పౌర సరఫరాల శాఖ సమీక్ష లో భాగంగా ఖరీఫ్ సీజన్ ధాన్యం సేకరణ, కొనుగోలు కేంద్రాలు కార్యకలాపాలు పై వివరాలు తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని, ప్రతి నియోజక వర్గంలో ఒక ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శాసన సభ్యులు చేతుల మీదుగా ప్రారంభం చెయ్యాలని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లడం లో ప్రజా ప్రతినిధులు సమక్షంలో చేపట్టాల్సి ఉంటుందనీ స్పష్టం చేశారు. నియోజక వర్గ స్థాయిలో వేడుకగా నిర్వహించాలన్నారు. పశుసంవర్ధక శాఖ ద్వారా చేపట్టిన. గోకులం షేడ్స్ కేటాయింపులు విధానంలో అప్ ల్యాండ్ లకు కూడా సమాన ప్రాధాన్యతా ఇవ్వాలని ప్రతి నియోజక వర్గానికి 50 యూనిట్స్ కేటాయించాలని కోరారు. ఆమేరకు ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లడం జరుగుతుందని ఇన్చార్జి మంత్రి తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద పల్లె పండుగ పనులను వేగవంతం చేసి సంక్రాతి నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. తదుపరి వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు.రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రాఫీ శాఖ మంత్రి కందుల దుర్గేశ్ మాట్లాడుతూ, సమీక్ష సమావేశంలో ఇసుక సమస్య ఇసుక సమస్య పై చర్చించడం జరిగిందన్నారు. భవన నిర్మాణ పనులకి ఎటువంటి ఆటంకం లేకుండా, ప్రజా ప్రతినిధులు అందరం ఒకే మాటకి రావడం జరిగిందన్నారు. నియోజక వర్గ స్థాయిలో సమస్యలను పరిష్కరించడంలో అపారమైన అనుభవం ఉన్న జిల్లా ఇంఛార్జి మంత్రి దృష్టికి తీసుకుని రావడం జరిగిందని, వాటిని పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టనున్నారని ఇందులో ఎటువంటి సందేహం లేదన్నారు. కూటమి ప్రభుత్వం కు అసలైన నిదర్శనంగా తూర్పు గోదావరి జిల్లా నిలిచిందన్నారు. జిల్లాను సమగ్ర అభివృద్ధి చేసే దిశగా అందరం కట్టుబడి ఉన్నామని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి మాట్లాడుతూ వినియోగదారులకు ఇసుక కొరత లేకుండా ఓపెన్ రీచ్ లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ జిల్లాలో అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల ప్రగతి నివేదికను జిల్లా ఇన్చార్జి మంత్రి నిమ్మల రామానాయుడుకు వివరించారు. రాజమండ్రి రూరల్ సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ సచివాలయం వ్యవస్థ ను ప్రక్షాళన చేసి సిబ్బందిని క్రమబద్ధీకరణ చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో మెరుగైన సేవలు అందించే క్రమంలో దృష్టి పెట్టాలన్నారు. ఇసుక ధరల, సరఫరా చేసే క్రమంలో మరింత సరళీకృత విధానాలు అమలు చెయ్యాలన్నారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థకు ఎన్నికలు నిర్వహించే విధానంలో సమస్య పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని, రూరల్ నియోజకవర్గం లో డ్రైనేజీ వ్యవస్థ ప్రక్షాళన దిశగా చర్యలు చేపట్టాలని శాసనసభ్యులు ఇన్చార్జిమంత్రికి వివరించారు.రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకానికి అవసరమైన భూసేకరణ, కోరుకొండ భూములు రిజిస్ట్రేషన్ ప్రక్రియ, తొర్రి గడ్డ రివర్స్ పంపింగ్ స్కీం టెండర్ల ప్రక్రియను, బొబ్బిలంక.. బొబ్బర్లంక బ్రిడ్జి నిర్మాణ పనులను, కోరుకొండ టెంపుల్ అభివృద్ధిని చేపట్టాలని వివరించారు.అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రహదారుల అభివృద్ధి కొరకు 89 సిమెంట్ స్టాప్ ఎక్కడ ఉందో తెలియడం లేదని అధికారులు చెబుతున్నారని దీనిపై పర్యవేక్షణ చేయాలని వివరించారు. చాగల నాడు, వెంకట నగర్, పుష్కర లిప్ ఇరిగేషన్లు పునరుద్దించి పూర్తి స్థాయిలో ఆయకట్టు సాగుకు సాగునీటి అందించాలని వివరించారు. కొవ్వూరు శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రిక పరికరాలు డ్రిప్, ట్రాక్టర్లు ఇతర పరికరాలను సబ్సిడీపై రైతులకు అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలని వివరించారు. తాళ్లపూడి ఎత్తిపోతలకు పథకాన్ని పునరుద్ధరించాలని, కొవ్వాడ కెనాల్ ఆధునీకరణ పనులు చేపట్టే దిశగా చర్యలు చేపట్టాలని, రహదారులు ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు ఇసుకను కేటాయించాలని వివరించారు. గోపాలపురం శాసనసభ్యులు మద్దిపాటి వెంకట్రాజు మాట్లాడుతూ భారీ వర్షాలు , వరదలు కారణంగా కొవ్వాడ, ఎర్ర కాలువ గట్లు బలహీనంగా ఉండటంతో ఈ ప్రాంతపు సుమారు 6 ఎకరాలు వరకు ముంపుకు గురవుతుందని కాలువల ఆధునీకరణ చేసే దిశగా ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించి త్వరితగట్టిన కాలువ గట్ల పటిష్టతను పెంచే పనులను చేపట్టాలని మంత్రికి వివరించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్న రాముడు, జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్, డిఆర్ఓ జి. నరసింహులు, మున్సిపల్ కమిషనర్ కేతన్ గార్గ్, శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ముప్పిడి వెంకటేశ్వరరావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బత్తుల బలరామకృష్ణ, మద్దిపాటి వెంకట్ రాజు, సిపిఓ అప్పలకొండ వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**ఎంపీడీవో కుమార్**



**అనంతగిరి అక్టోబర్ 26 (ఆంధ్రపత్రిక) :** ప్రభుత్వ ఆదేశాల మేరకు 15 సంవత్సరాల నిండి మధ్యలో చదువు మానేసిన ఆడపిల్లల కోసం ప్రభుత్వం ఉల్లాస్ అనే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో ఏ వివి కుమార్ అన్నారు.. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉల్లాస్ కార్యక్రమం పై ఐసిడిఎస్ పిఓ, వెలుగు ఏపీఎం , వెలుగు సీసీలతో సమావేశాన్ని ఆయన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కుమార్ మాట్లాడుతూ .చదువు మానేసిన యువతల కొరకు ఉల్లాస్ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ఈ పథకం ఐదు భాగాలుగా విభజించబడిందన్నారు. ప్రాథమిక అక్షరాస్యత మరియు సంఖ్యా శాస్త్రం, జీవన నైపుణ్యాలు ,వృత్తి నైపుణ్యాలు, ప్రాథమిక విద్య ,నిరంతర విద్య అనే కార్యక్రమాలు ప్రవేశపెట్టిందన్నారు .మండలంలో చదువు మధ్యలో ఆపేసినమహిళలను గుర్తించి ఈ పథకం వర్తింప చేయాలని ఆయన కోరారు. ఈ పథకము గా వెలుగు సిబ్బంది పూర్తి బాధ్యతలు తీసుకొని చదువు మానెసిన మహిళలను గుర్తించాలన్నారు. వీళ్ళకి వాలంటీర్ల ద్వారా శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ సంతోష్ కుమారి .వెలుగు సిబ్బంది పాల్గొన్నారు .

## అస్సాగోపై గుమ్మళ్ళదొడ్డిలో హోరెత్తిన ప్రజాపోరు





**ఆమరణ నిరాహార దీక్షకు సంఘీభావంగా**

**జాతీయ రహదారిపై బైఠాయించిన గ్రామస్తులు**

**అస్సాగో ఇథనాల్ ఫ్యాక్టరీ ముట్టడించిన బాధితులు**

**రాస్తారోకోతో భారీగా నిలిచిపోయిన ట్రాఫిక్**

**శిబిరాన్ని సందర్శించిన మాజీ ఎంపీ హర్షకుమార్**

**గోకవరం, అక్టోబర్ 26 (ఆంధ్రపత్రిక) :** ప్రజల అనారోగ్య సమస్యలకు దారితీస్తున్న అస్సాగో ఇథనాల్ ఫ్యాక్టరీ తక్షణమే మూసివేసి, సముద్ర తీర ప్రాంతానికి తరలించాలని బాధిత గ్రామాల ప్రజలు డిమాండ్ చేశారు. అస్సాగో ఫ్యాక్టరీ వల్ల వచ్చే సమస్యలపై జగ్గంపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ మరోతి శివ గణేష్, సామాజిక ఉద్యమనేత పాటంశెట్టి సూర్యచంద్ర శ్రీదేవి దంపతుల ఆమరణ నిరాహార దీక్ష శనివారం 5వ రోజు కొనసాగింది. ఈశిబిరాన్ని రాజమండ్రి మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ సందర్శించి సంఘీభావం తెలియజేశారు. ఈసందర్భంగా హర్షకుమార్ మాట్లాడుతూ, ఆవాస ప్రాంతాల మధ్య ఫ్యాక్టరీని ఏర్పాటు చేయడం వల్ల తీవ్ర సమస్యలు తలెత్తుతున్నాయని, ఇది దారుణమైన చర్యన్నారు. ఆమరణ దీక్షకు సంఘీభావంగా మధ్యాహ్నం నాలుగు గ్రామాల ప్రజలు జాతీయ రహదారిపై గుమ్మళ్ళదొడ్డి వద్ద భారీ రాస్తారోకో నిర్వహించగా, భారీగా ట్రాఫిక్ స్తంభించింది. ఈసందర్భంగా ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. అక్కడ నుండి ఆందోళన వేస్తున్న మహిళలు గ్రామస్తులు అస్సాగో కంపెనీ వద్దకు చేరుకున్నారు. అస్సాగో కంపెనీ గేటు వద్ద ముట్టడించారు. సుమారు మూడు గంటలపాటు నిరసన తెలియజేశారు. అచ్చుతాపురం, గుమ్మళ్ళదొడ్డి, వెదురుపాక, బావాజీపేట గ్రామాల్లో ఆమరణ దీక్షకు మద్దతుగా పాఠశాలలు, షాపులు బంద్ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. గుమ్మళ్ళదొడ్డిలో జరుగుతున్న ఆందోళన నేపథ్యంలో అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు, పలువురు సర్కిల్ ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు, పెద్ద ఎత్తున మహిళా పోలీసులు రాత్రి అయ్యే వరకు గుమ్మళ్ళదొడ్డి గ్రామంలో మొహరించారు. ఈరాత్రికి దీక్ష భగ్నం చేసే



అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. ఆమరణ దీక్షకు సంఘీభావంగా గుమ్మళ్ళదొడ్డి, అచ్చుతాపురం గ్రామానికి చెందిన పలువురు రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. ఆమరణ దీక్షలో ఉన్న నాయకుల ఆరోగ్య పరిస్థితి క్షీణించినట్టు వైద్యులు తెలిపారు.గ్గా



## హరిపాలెం పి.హెచ్.సిలో స్వచ్ఛతా హి సేవా



**అచ్యుతాపురం, అక్టోబర్ 26, (ఆంధ్రపత్రిక) :** మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హరిపాలెంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమములో భాగంగా ఆసుపత్రి పరిసరాలను ఆరోగ్య విస్తరణాధికారి సూరిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం శుభ్రం చేసారు. సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు చుట్టుప్రక్కల తుప్పలు, పనికిరాని మొక్కలను తొలగించి పరిశుభ్రంగా చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య బోధకులు రామలక్ష్మి, ఆశా నోడల్ ఆఫీసర్ సునీత, ఆరోగ్య పర్యవేక్షకులు ఉమా మహేష్, సిబ్బంది గణేష్, నాగేశ్వరరావు, ఏఎన్ఎం లు, ఆశా కార్యకర్తలు పాల్గొనారు.

## ఎస్.పి తుహిన్ సిన్హాను కలిసిన ఎమ్మెల్యే సుంధరపు



**అచ్యుతాపురం, అక్టోబర్ 26, (ఆంధ్రపత్రిక) :** అనకాపల్లి జిల్లా ఎస్.పి తుహిన్ సిన్హా ను శుక్రవారం అనకాపల్లి ఎస్.పి కార్యాలయంలో యలమంచిలి నియోజకవర్గ ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్.పితో పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ నేరాల నియంత్రణలో జిల్లా ప్రథమ స్థానంలో ఉండేలా చూడాలని అన్నారు. గంజాయి నియంత్రణ మీద దృష్టి పెట్టాలని, మహిళల మీద జరుగుతున్న దాడులను అరికట్టే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ వాతావరణం ఏర్పాటు చేయాలని తెలిపారు.

## నాగులాపల్లి లో రామభక్తి చాటుకున్న రామభక్తుడు



**మునగపాక, అక్టోబర్ 26, (ఆంధ్రపత్రిక) :** మండలం లో నాగులాపల్లిలో రామభక్తి చాటుకున్న రామభక్తుడు మల్ల అనంతరావు. రామకోటి రాసి వీర భక్తుడిగా భక్తిని చాటుకున్నారు. రామకోటి రాసిన 100 పుస్తకాలను శనివారం ఉదయం 7 గంటల నుండి పల్లకిలో నాగులాపల్లి గ్రామం లో భక్తిశ్రద్ధలతో ఊరేగించి రామాలయంలో పెట్టడం జరుగుతుంది అన్నారు. ఈ కార్యక్రమం లో భాగంగా మధ్యాహ్నం 12 గంటల నుండి అన్నసమరాధణ కార్యక్రమం జరిగింది. రాత్రికి రామ భక్తులచే హరిబజన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది, కావున భక్తులందరు విచ్చేసి ఈ అద్భుతమైన రామ కార్యక్రమం లో పాల్గొన్నారు. హిందూధర్మ పరిరక్షణ సమితి కన్వీనర్ వాసు, రామాప్రభూ, ఈశ్వరావు, సూరీప్రభ, నూకరత్నం, మాణిక్యం రామభక్తులు తదితరులు పాల్గున్నారు. 8సంవత్సరాలు రామకోటి రాసిన రామభక్తుడు మల్ల అనంతరావు ని గ్రామం లో పలువురు సన్మానించారు.

# వృక్ష సంహారం



**విజయవాడ,అక్టోబర్ 26(ఆంధ్రపత్రిక):**పర్యావరణ పరిరక్షణ అన్నది కేవలం నినాదంగా మారింది. ఢిల్లీ విషయ మే తీసుకుంటే వాతావరణ కాలుష్యం అరిక ట్టే చర్యలు కానరావడం లేదు. కోర్టులు మొత్తుకుం టున్నా పట్టింపు లేదు. కాలుష్యం కారణంగా తాను వాకింగ్‌కు కూడా వెళ్లలేక పోతున్నానని సుప్రీం చీఫ్ జస్టిస్ డివై చంద్రచూడ్ చేసిన వ్యాఖ్యలు గమనార్హం. ఎంతగా పరిస్థితి దిగజారిందో గుర్తించాలి. ఢిల్లీ కాలుష్యపరిస్థితిలో మార్పు కానరావడం లేదు. గాలి నాణ్యత పడిపోతున్నా పట్టించుకోవడం లేదు. పంట వ్యర్థాలను కాల్చకుండా కూడా అరికట్టడం లేదు. మానవాళికి చెట్లు చేసే మేలేమిటో తెలుసుకోవడానికి ఎవరూ గూగుల్‌ను ఆశ్రయించనవసరం లేదు. పర్యావరణవేత్తలు చెబితే తప్ప తెలియని వారెవరూ లేరు. చెట్ల ఉపయోగాల గురించి బడి చదువుల దగ్గరనుంచి గురువులు నూరిపోయడమే ఇందుకు కారణం. దురదృష్టమేమంటే అధికార పీఠాలపై ఉన్న నేతలు, ఉన్నతాధికార వర్గంలో పనిచేస్తున్నవారు ఏ బళ్లో చదువుకుని ఆ స్థాయికి ఎదిగారోగానీ... దేశంలో 'అభివృద్ధి' పేరు చెప్పి వృక్ష సంహారం జరగని రోజంటూ దేశంలో ఉండటం లేదు. చెట్లను కాపాడటానికి పర్యావరణ ఉద్యమకారులు చేయని పోరాటమంటూ లేదు. ప్రాణవాయువును అందిస్తున్న వృక్షజాలాన్ని ధ్వంసం చేయాలా అని ప్రశ్నిస్తున్నారు. విభిన్న జాతుల పక్షుల్ని వీక్షించడానికి, తమ కెమెరాల్లో బంధించడానికి విహంగ ప్రేమికులు నిత్యం ప్రకృతి ఒడిలోకి వస్తారు. ప్రశాంతంగా స్వచ్ఛమైన వాయువు పీల్చి పునీతులు కావడానికి నగర వాసుల్లో అత్యధికులు ఎన్నుకునే పార్కులు, చెట్టు ఉన్నచోటే. ఇది లోపించడం వల్ల ఇటీవల ఢిల్లీ కాలుష్యం పీల్చలేనంతగా తయారయ్యింది. చెట్లనుంచి వీచే గాలిని ఆస్వాదిస్తూ వందలమంది సైక్లింగ్, జాగింగ్ చేస్తుంటారు. పాలకుల తీరు కారణంగా, నగాల వ్యాప్తి కారణంగా ముంబైతో సహా మన మహానగరాలు కాంక్రీట్ జంగిల్స్‌గా మారుతున్నాయి. ఉపాధి దొరుకు తుందని పల్లెలు వీడి వస్తున్న వారితో పట్టణీకరణ పెరుగుతోంది. ప్లాస్టిక్ విపరీతంగగా వాడకం పెరిగిగి అనేకం కాలుష్య కారకాలుగా తయారయ్యాయి. ప్రపంచంలో అత్యంత కాలుష్యభరిత నగరాలు 20 ఉంటే అందులో 15 మన నగరాలే. ఈ నగరాల వాతావరణంలో, ఇక్కడి తాగునీటిలో మృత్యువు దాగుందని నిపుణులు చాన్నాళ్లుగా చెబుతున్నారు. నగర పౌరుల ఊపిరితిత్తుల్లోకి కొంచెం కొంచెంగా చొరబడుతున్న కాలుష్యం వారిని రోగగ్రస్తులుగా మారుస్తోంది. కేన్సర్, గుండె జబ్బులు వగైరాలకు కారణమవుతోంది. అనేకుల్లో అకాల వృద్ధాప్యాన్ని కలిగిస్తోంది. వారిని పనిపాటలకు దూరం చేస్తోంది. ఇదంతా మన పాలకులకు ఆందోళన కలిగించాలి. దీన్ని సరిచేయడానికి అవసరమైన ప్రణాళికలు రూపొందించడానికి పురిగొల్పాలి. కాలనీలో చెట్లు పెంచాలి. ఉన్న చెట్లను తొలగించకతప్పదను కుంటే ఆ చెట్లను మరొకచోట పాతడానికి ప్రయత్నించాలి. ప్రపంచ అధ్యయన సంస్థలు చెబుతున్న వాస్తవాలను అమలు చేయాలి. ఇల్లు కట్టుకుందా మనో, ఉన్న ఇంటిని విస్తరించుకుందామనో ఎవరైనా తమ ఆవరణలో చెట్లు కొట్టాలంటే అందుకు అనుమతులు తీసుకోవడం అవసరం. కానీ తమకు అలాంటి నిబంధనలు వర్తించవన్నట్టు అధికార యంత్రాంగాలు ప్రవర్తిస్తున్నాయి. పాలకులే ఇలా చట్టాల్ని ధిక్కరించే స్థితికి దిగజారడం కారణంగా దేశంలో పర్యావరణం దెబ్బతింటోంది. ఇప్పటికైనా పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి.

### భారత ప్రభుత్వం రోడ్డు రవాణా రహదారుల మంత్రిత్వ శాఖ కమిటీ సభ్యురాలిగా

# అరుకు ఎంపీ గుమ్మ తనూజరాణి



**అరకులోయ,అక్టోబర్ 26 (ఆంధ్రపత్రిక):** భారత ప్రభుత్వం పార్లమెం ట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఇదివరకు అరుకు ఎంపీకి హౌసింగ్ అర్బన్ వ్యవహారం. (ఓబీసీ) జాతీయ ఇతర వెనకబడిన తరగతుల సంక్షేమ కమిటీ సభ్యురాలిగా నియమించి ఉన్నప్పటికీ అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రోడ్డు రవాణా జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ కమిటీ సభ్యురాలిగా మన అరుకు ఎంపీ గుమ్మ తనూజరాణికి నియమిస్తూ భారత ప్రభుత్వం పార్లమెంట్ వ్యవహా రాల మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయమై రాజకీయ నాయకులు పలు ప్రజాసంఘాలు తదితరులు అరుకు ఎంపీకి అభినందనలు తెలుపుతున్నారు.

# ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్త వాతావరణం

(మొదటిపేజీ తరువాయి)

వైపు నుంచి దూసుకొచ్చిన నాలుగు డ్రోన్లను అడ్డుకున్నామని ఐడీఎఫ్ తెలిపింది. మరోపక్క ఇజ్రాయెల్‌పై స్పందించే విషయంలో తాము తొందరపడమని, అలాగే సంకోచించమని ఇరాన్ ఎంపీ అహ్మద్ అజ్జమ్ వెల్లడించారు. "మమ్మల్ని మేం రక్షించుకునే హక్కు ఉంది. దానికి తగ్గట్టే మేం స్పందిస్తాం" అని వెల్లడించారు. ఇదిలా ఉంటే.. ఇజ్రాయెల్ జరిపిన దాడిలో ఇద్దరు సైనికులు చనిపోయారని ఇరాన్ వెల్లడించింది. టెహ్రాన్‌లోని దాదాపు 20 లక్ష్యాలపై ఇజ్రాయెల్ దాడులకు పాల్పడింది. దాదాపు 100 యుద్ధ విమానా లను ప్రయోగించి బాంబులు జారవిడిచింది. ఇరాన్‌కు చెందిన డ్రోన్ ఫ్యాక్టరీలు, బాలిస్టిక్ క్షిపణి తయారీ. ప్రయోగ కేంద్రాలపై విరుచుకుపడింది. ఈ దాడుల్లో దక్షిణ టెహ్రాన్‌లోని ఓ డ్రోన్ ఫ్యాక్టరీ పూర్తిగా ధ్వంసమైనట్లు తెలుస్తోంది. అయితే, ఐడీఎఫ్ దాడుల కారణంగా తమకు నష్టం స్వల్ప స్థాయిలోనే ఉందని ఇరాన్ వెల్లడించింది. ఇక ఈ దాడుల్ని సౌదీ అరేబియా, యూఏఈ, పాక్ వంటి దేశాలు ఖండించాయి.

# త్వరలోనే గాడిలోకి ప్రపంచ ఆర్థికవ్యవస్థ

(మొదటిపేజీ తరువాయి)

ఎక్కువగా ఉన్నట్లు ప్రపంచదేశాలు భావిస్తున్నాయి. ఫండ్, కేంద్ర బ్యాంకులు, వివిధ సంస్థలు, ప్రభుత్వాలు చేసిన ప్రయత్నాల వల్ల ద్రవ్యోల్బణం కొంతమేర తగ్గింది. దీనివల్ల ప్రపంచ ఆర్థికవ్యవస్థ తిరిగి పుంజుకుంటుంది. అభివృద్ధి చెందిన దేశాల ఆర్థికవ్యవస్థల్లోనూ వృద్ధి శాతం పెరుగుతోంది. అయితే ఈ విషయంలో దేశాలన్నీ మరింత జాగ్రత్త వహించాలి. ఎందుకంటే ఆర్థికవ్యవస్థలు స్థిరంగా ఉన్నాయి కానీ, వెంటనే పుంజుకునేలా లేవు" అని నిర్మలా సీతారామన్ అన్నారు. కొవిడ్ మహమ్మారి, పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణ ప్రభావం ప్రపంచదేశాల ఆర్థిక వ్యవస్థలపై ఎక్కువగా ఉందని ఆమె పేర్కొన్నారు. కొవిడ్ సమయంలో ప్రపంచదేశాలు అధికంగా రుణాలు తీసుకోవడం వల్ల ద్రవ్యలోటుపై నియంత్రణ కోల్పోయాయని.. దానిని సహేతుకమైన సంఖ్యకు తీసుకురావడానికి సరైన చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. భారత్ ప్రపంచదేశాల నుంచి పెద్దమొత్తంలో దిగుమతులు చేసుకోవడం వల్ల దేశ ఆర్థికవ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. దేశంలో సంప్రదాయ ఉత్పత్తులు పెద్ద మొత్తంలో ఉత్పత్తి కాకపోవడం వల్ల ఎగుమతుల్లో పెరుగుదల కనిపించ ట్లేదని తెలిపారు. భారత్ అంతర్గత సవాళ్ల కంటే బాహ్య సవాళ్లను అధికంగా ఎదుర్కొంటోం దని.. అయినా సాధ్యమైనంత వేగంగా వృద్ధి చెందడానికి ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు.

# ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం

(మొదటిపేజీ తరువాయి)

నేతృత్వంలో మంత్రుల కమిటీ ఏర్పాటైంది. కమిటీలో సభ్యులుగా వ్యవసాయ శాఖ అచ్చెన్నాయుడు, మంత్రి సత్యకుమార్ యాదవ్, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, పౌరసరఫరాల శాఖ ఎక్స్‌ఆఫీషియో కార్యదర్శి ఈ కమిటీకి కన్వీనర్‌గా ఉంటారని ప్రభుత్వం పేర్కొంది. నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలు ఆకస్మికంగా ఎందుకు పెరుగుతున్నాయన్న అంశంపై అధ్యయనం చేయాలని ఆదేశాలు జారీ చేసింది. నిత్యావసరాలు, కూరగాయల ధరల తగ్గింపునకు చేపట్టాల్సిన చర్యలపైనా సిఫార్సులు చేయాలని కమిటీకి ప్రభుత్వం సూచించింది. ఉత్పత్తి, సప్లై, డిమాండ్, ధరలకు సంబంధించిన అంశాలు, పంటల తీరు, ఎగుమతులు, దిగుమతులపై కూడా అధ్యయనం చేయాల్సిందిగా ఆదేశించింది. వినియోగదారులకు అందుబాటు ధరల్లో నిత్యావసరాలు, కూరగాయలు లభించేలా తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక ఇవ్వాలని తెలిపింది. ధరలు నియంత్రణలోకి తెచ్చేందుకు అవసరమైన యంత్రాంగం రూపకల్పనకు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. వేగంగా నిర్ణయాలు తీసుకునేందుకు వీలుగా ఈ అంశాలపై ఓ డేటా బేస్‌ను ఏర్పాటు చేయాలని ఆర్డర్స్ వేసింది. ధరలు పెరిగినప్పుడు మార్కెట్ ఇంటర్వెన్షన్‌ను అమలు చేసేలా శాశ్వత ప్రాతిపదికన ధరల నియంత్రణ నిధిని ఏర్పాటు చేసేందుకు సూచనలు ఇవ్వాలని వెల్లడించింది. ధరల పెరుగుదల, నియంత్రణ, మార్కెట్ ఇంటర్వెన్షన్లపై అధికారుల కమిటీ ఇచ్చిన సిఫార్సులను అధ్యయనం చేయాలని సూచించింది. ఆహార పంటలు, నిత్యావసరాలకు సంబంధించి ఉత్పత్తి, సరఫరా, నిల్వలకు సంబంధించి దీర్ఘ, స్వల్పకాలిక ప్రణాళికల అమలుపైనా ప్రభుత్వం సిఫార్సులు కోరింది. ఉత్పత్తి, నిల్వల్లో ఆధునిక టెక్నాలజీ వినియోగం ద్వారా ఏడాది పొడవునా ధరల్ని నియంత్రణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశాలు జారీ చేసింది. వ్యవసాయదారులు, మిల్లర్లు, ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఆహారధాన్యాలు, పప్పు దినుసులు, వంటనూనె డీలర్లు, ఎగుమతి, దిగుమతిదార్లతో సమావేశం కావాలని ఆదేశించింది. అధ్యయనం అనంతరం తదుపరి నిర్ణయం కోసం సమగ్ర నివేదిక సమర్పించాలని మంత్రుల కమిటీకి ఏపీ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

# ప్రజల నమ్మకాన్ని నెరవేర్చాలి

(మొదటిపేజీ తరువాయి)

వైసీపీ నేతల దాడిలో ప్రాణాలు కోల్పోయిన, దాడులకు గురైన, ప్రమాదాల్లో మృతి చెందిన కార్యకర్తల కుటుంబాలతో జూమ్ కాల్ ద్వారా మాట్లాడారు. అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. శనివారం పవిత్రమైన దినం. పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభించాం. పార్టీ పెట్టిన తొలినాళ్లలో రూపాయితో సభ్యత్వం ప్రారంభించాం. టీడీపీలో సభ్యునిగా చేరడంతో సమాజంలో గుర్తింపు, గౌరవం ఉంటుంది. టీడీపీ సభ్యత్వం కార్డు పెట్టుకోవడమే ప్రతి ఒక్కరూ ఒక హెూదాగా భావిస్తారు. కార్యకర్తల మనోభా వాలను గౌరవించాం. గ్రామ కమిటీ నుండి రాష్ట్ర కమిటీ వరకు కార్యకర్తల భాగస్వామ్యం, అభీష్టం మేరకు కమిటీలు వేశాం. టీడీపీ రాకముందు కొన్ని కుటుంబాలకే పరిమితమైన అధికారాన్ని సామాన్యులకు చేరువ చేశాం. చదువుకున్న యువతకు ఎంపీ, ఎమ్మెల్యేలుగా అవకాశం ఇచ్చాం. బలహీన వర్గాలను ప్రోత్సహించాం. టీడీపీ రాజకీయ విశ్వవిద్యాలయం. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అనేక మంది నాయకులను తయారుచేశాం.రెండురాష్ట్రాల్లో ఏ ముఖ్య నాయకుడిని చూసినా వారి మూలాలు టీడీపీతోనే ప్రారంభ మయ్యాయి. రాజకీయ కార్యకర్తలకు ప్రత్యేకంగా తరగతులకు ఇచ్చిన ఏకైక పార్టీ మనది. కార్యకర్తలను నాయకులుగా చేయడానికి అనునిత్యం పని చేశాం. ఎంతోమంది ప్రమాదాలు, రాజకీయ కక్షల్లో ప్రాణాలు కోల్పోయారు. చనిపోయిన వారి కుటుంబాలు అనాథగా ఉండకూడదని వారి కోసం ప్రత్యేకంగా స్కూల్ నడిపిన ఏకైక పార్టీ టీడీపీ. వందల మందిని చదివించి వారి జీవితాల్లో వెలుగులు తీసుకొచ్చాం. దేశంలోనే మొదటి సారి బీమా విధానాన్ని తీసుకొ చ్చాం. రూ.100లతో సభ్యత్వం తీసుకుంటే రూ.5 లక్షల బీమా అందించబోతున్నాం. సహజ మరణం జరిగిన వారికి మట్టి ఖర్చుల కింద రూ.10 వేలు అందిస్తాం. కొందరు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి లైఫ్ టైం సభ్యత్వం తీసుకుంటున్నారు. కార్యకర్తల కోసం రూ.120 కోట్లు ఖర్చు చేశాం. 5,113 మంది రూ.102 కోట్లను బీమా సొమ్ము కింద అందించాం. సహజ మరణం పొందిన వారికి రూ.18 కోట్లు ఖర్చు చేశాం. పేద పిల్లల చదవులకు రూ.2.5 కోట్లు, 180 మందికి విదేశాల్లో చదివే వారికి ఆర్థిక సాయం చేశాం. ఎన్టీఆర్ ట్రస్ట్, ఇతర స్కూళ్లలో 4,732 మందిని చదివించే బాధ్యత తీసుకున్నాం. అన్ని పార్టీల కంటే మనపార్టీ భిన్నమైంది. అధికారం కోసం నాడు ఎన్టీఆర్ పార్టీ పెట్టలేదు. ఓటర్లకు దగ్గరగా ఉండాలన్న ఉద్దేశంతో కొత్త వ్యవస్థలైన క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీలను తీసుకొచ్చాం. పార్లమెంట్‌లో కూడా ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషిం చాం. నేషనల్ ఫ్రంట్, యునైటెడ్ ఫ్రంట్‌ల ద్వారా ప్రధానులు నిర్ణయించాం.' అని



అన్నారు. మొన్న జరిగింది ఎన్నికలు కాదు రాక్షసుడితో యుద్ధం' నాలుగు దశాబ్దాల ప్రస్తానంలో అనేక సమస్య లు, సవాళ్లు, ఇబ్బందులను సమర్థవంతంగా ఎదుర్కొన్నా చాలా మంది టీడీపీ పనైపోయిందన్నారు. కానీ ఆ మాట అన్నవారి పనైపో యింది. టీడీపీని భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉంది. మొన్నటి ఎన్నికల్లో మన శక్తి ఏంటో చూపించాం. సామాజి క సమీకరణాలతో ముందుకెళ్లి అన్ని కులాలకు ప్రాధాన్యం ఇచ్చాం. టీడీపీ, జనసే, బీజేపీ కలిసి పోటీ చేసి ఘన విజయం సాధించాయి. పార్టీ ఇచ్చిన పిలుపు అందుకుని ప్రతి కార్యకర్త ఎన్డీయే విజయానికి కృషి చేశారు. మొన్న జరిగింది ఎన్నికలు కాదు...రాక్షసుడితో యుద్ధం. ప్రజాస్వామ్యంలో ఇలాంటి వ్యక్తులు వస్తారని ఊహిం చలేదు. మనస్ఫూర్తిగా చెప్తున్నా... మొన్నటి ఎన్నికల్లో గెలుపు కార్యక ర్తల విజయమే. వేధింపులు, కేసులు, అరెస్టులు, దాడులతో ఇబ్బం దులు పెట్టారు. ఏ నాయకుడూ వెనక్కి తగ్గలేదు...ఎవరూ జెండా వదల్లేదు. చాలా మంది ప్రాణాలు, ఆస్తులు కోల్పోయారు. మనపై రెండు ప్రధాన బాధ్యతలు ఉన్నాయి. రాజకీయంగా త్యాగాల చేసిన వారిని కాపాడుకోవాలి. నమ్మిన ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి. నేను ఇప్పుడు 1995నాటి సీఎంని... 2014 సీఎంను కాదు. 1995లో సిఎం అయ్యాక పార్టీ, ప్రభుత్వాన్ని సమర్థవంతంగా ముందుకు నడిపించాం. కార్యకర్తలు, నాయకుల్లో నాడు మనోధైర్యం నింపాం. అధికారులు కూడా పని చేయకపోతే చర్యలు తీసుకున్నాం. ఎవరైనా రాజకీయ ముసుగులో తప్పులు చేస్తే వదిలిపెట్టను. వ్యక్తిగత అంశాలను పార్టీ కక్షలుగా తీర్చుకుంటామంటే సమస్యలు వస్తాయి. ప్రజల పట్లమనకున్న విశ్వసనీయతను పోగొట్టుకోవడం రెండు నిమిషాలు. కొందరు సమాచారాన్ని ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలని చెప్తున్నారు. నాలుగోసారి సీఎం అయిన నేను ఇంతటి అస్తవ్యస్త పరిస్థితులు గతంలో ఎప్పుడూ చూడలేదు. విధ్వంసం నుండి గాడిలో పెట్టాలంటే సమయం పడుతోంది. గత పాలకుల విచ్చలవిడి తప్పులతో ప్రస్తుతం ఇబ్బందుల్లో ఉన్నాం. నాసిరకం, సొంత బ్రాండ్లతో మద్యం సరఫరా చేసి గత పాలకులు ప్రజల ప్రాణాలతో ఆడుకున్నారు. అందుకే నూతన మద్యం పాలసీ తెచ్చాం. ఇసుక అందుబాటులో లేకుండా చేశారు. మనం వచ్చాక ఉచిత ఇసుక పాలసీని తెచ్చాం. సీనరేజ్, లోడింగ్ ఛార్జీలు రద్దు చేశాం. వైసీపీ నేతలు రూ.30లకే ఇసుక తోడుతామని టెండర్లు వేశారు. ఇసుక పాలసీపై తప్పుడు సంకేతాలు తీసుకెళ్లడానికి ప్రయత్నిస్తు న్నారు. ఇసుక విషయంలో ఎవరు దందా చేసినా తిరుగుబాటు చేయండి. ఇందులో మనవాళ్ళు తప్పు చేసినా ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుంది. మద్యం ఎమ్మార్పీ రేట్లకంటే ఎవరు ఎక్కువ అమ్మినా చర్యలు తీసుకుంటాం. కొందరు ముసుగులో నేరంచేసి దాన్ని మనపై నెట్టే ప్రయత్నం చేస్తారు. అప్రమత్తంగా ఉండాలి.' అని అన్నారు. సమపాళ్లలోఅభివృద్ధి-సంక్షేమంజాబ్ ఫస్ట్ విధానం కోసం ఆరు కొత్త పాలసీలు తీసుకొచ్చాం. అధికారంలోకి రాగానే రూ.4 వేలు పెన్షన్ అమలు చేశాం. ఆదాయం తక్కువ ఉన్నప్పటికీ పేదలపై ప్రేమతో అత్యధిక పింఛన్లు అందిస్తున్నాం. దివ్యాంగులకు రూ.6 వేలు, కిడ్నీ బాధితులకు రూ.10 వేలు, శాశ్వత వ్యాధితో బాధపడేవారికి రూ.15 వేలు అందిస్తున్నాం. దీపావళి నుండి యేడాదికి 3 గ్యాస్ సిలిండర్ల పథకాన్ని ప్రారంభిస్తున్నాం. చెత్తపన్ను రద్దు, స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటు, 217 జీవో రద్దు చేశాం. గౌడలకు మద్యం షాపుల్లో 10 శాతం రిజర్వేషన్లు అమలు చేశాం. అర్చకులకు జీతాలు రూ.10 వేల నుండి రూ.15 వేలకు పెంపు, దేవాలయాల్లో బ్రాహ్మణ, నాయీ బ్రాహ్మణులకు ఆలయ కమిటీల్లో స్థానం కల్పించాం. దీపధూపనైవేద్యాలకు రూ.10 వేలు అందిస్తు న్నాం. చేనేతపై జీఎస్టీ ఎత్తేశాం. అధికారంలోకి రాగానే రైతుల ధాన్యం బకాయిలు రూ.1674 కోట్లు చెల్లించాం. రూ.4,500 కోట్లతో గ్రామాల్లో 30 వేల పనులకు శ్రీకారం చుట్టాం. డిసెంబర్ నెల నుండి పూర్తి స్థాయిలో రాజధాని పనులు ప్రారంభమవుతాయి. రెండేళ్లలో పోలవరం పేజ్ 1 పూర్తి చేస్తాం. ఓర్వకల్లు, కొప్పర్తిలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేస్తున్నాం. రైల్వే జోన్ ఏర్పాటుకు సమస్యలు పరిష్కరించి భూమి కేటాయించాం. అమరావతికి కొత్త రైల్వేలైన్ కు కేంద్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. గ్రామాల్లో 3సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు ఇంటిస్థలం ఇవ్వబోతున్నాం. ప్రజల కోసం మనం కష్టపడుతున్నాం. రాష్ట్రాభివృద్ధికి కేంద్రం సహకరిస్తోంది.

### ఉత్సాహంగా అరకు లోయలో

# టీడీపీ సభ్యత్వ నమోదు



**అరకులోయ,అక్టోబర్ 26 (ఆంధ్రపత్రిక):**మండల పరిధిలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం అరకులో ఉత్సాహంగా ప్రారంభమైంది. తెలుగుదేశం పార్టీ అరకులోయ నియోజకవర్గ ఇన్చార్జి సియ్యారి దొన్నుదొర ఆదేశాల మేరకు ఆ పార్టీ మండల అధ్యక్షులు శెట్టి బాబురావు పెదలబుడు సర్పంచ్ పెట్టెలి దాసు బాబు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమానికి శనివారం శ్రీకారం చుట్టారు. సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు రసీదును అందజేసిన అనంతరం బాబురావు దాసు బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ మాదిరిగా తెలుగుదేశం బలమైన శక్తిగా అవతరించిందో భవిష్యత్తులో అరకులోయ నియోజకవర్గంలో కూడా పార్టీకి కంచుకోటగా మారబోతుందని అన్నారు. కేవలం రాజకీయపరంగా మాత్రమే కాకుండా ప్రతి కుటుంబానికీ తెలుగుదేశం పార్టీ అండగా ఉండాలనే ఉద్దేశంతో సభ్యత్వ నమోదు కార్యక్రమం జరుగుతుందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకునేందుకు వేలాదిమంది ఆసక్తి చూపుతున్నారని పార్టీ ఇచ్చిన లక్ష్యాల్ని అధిగమించి సభ్యత్వ నమోదు చేసేందుకు శ్రేణులంతా ముందుకు నడుస్తున్నారన్నారు. మిగిలిన పార్టీ వాళ్లు కూడా తెలుగుదేశం పార్టీలో చేరాలనిసభ్యత్వం తీసుకొవాలనే ఆసక్తిని కనబరుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాదల సర్పంచ్ వంతల శ్రీనివాసరావు ఎక్స్ ఎంపీపీ పొద్దు అమ్మన్న టిడిపి సీనియర్ నాయకురాలు అసెంబ్లీ మహిళ అధ్యక్షురాలు కళావతి అసెంబ్లీ ఆర్గనైజేషన్ నూకరత్నం మండలం మహిళ అధ్యక్షులు ద్రౌపతి వార్డ్ సభ్యులు శెట్టి దీన టీడీపీ నాయకులు, అరుణ బోరి బోరి లక్ష్మి మాదల వార్డ్ సభ్యులు గంగమ్మ తులావతి అర్జున్‌టీడీపీ నాయకులుపాడి చందు వార్డ్ సభ్యులు త్రినాథ్ ఎంపీటీసీ భీమరాజు టీడీపీ నాయకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# వయనాడ్ ప్రజల తీరు స్ఫూర్తిదాయకం

**న్యూఢిల్లీ, అక్టోబరు 26:** ప్రత్యక్ష ఎన్నికల బరిలోకి అరంగేట్రం చేసిన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వయనాడ్ ఉప ఎన్నిక పోరుకు సిద్ధమవుతున్నారు. ఇటీవలే ఈ లోక్‌సభ స్థానం నుంచి నామినేషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో తాజాగా వయనాడ్ నియోజకవర్గ ప్రజలను ఉద్దేశించి ఓ భావోద్వేగభరిత పోస్ట్ చేశారు. ఎన్నికల్లో పోటీ "కొత్తేమో గానీ.. ప్రజల తరఫున పోరాటం తనకు కొత్తేమీ కాదని అన్నారు. "కొన్ని నెలల క్రితం నేను, మా సోదరుడు రాహుల్‌తో కలిసి మండక్కై చూరాల్‌మల వెళ్లాను. కొండచరియలు విరిగిపడటంతో ప్రకృతి సృష్టించిన బీభత్సం కారణంగా మీరు ఎదుర్కొన్న నష్టాన్ని, సర్వం కోల్పోయిన మీ ఆవేదనను కళ్లారా చూశా. పిల్లలను కోల్పోయిన తల్లులు, కుటుంబాన్ని కోల్పోయి అనాథలుగా మారిన చిన్నారులను చూశా. ఆ చీకటి రోజుల నుంచి బయటపడి నవశక్తితో మీరు ముందుకు కదిలిన తీరు స్ఫూర్తిదాయకం. నిస్సహాయ స్థితిలోనూ తోటి వారి కోసం మీరు పడిన ఆరాటం.. మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం. ఆ విషాద సమయంలో మీరు చూపించిన ఆచంచలమైన ధైర్య సాహసాలే.. ఈ రోజు నాలో స్ఫూర్తిని నింపాయి. మీ తరఫున పార్లమెంటులో ప్రాతినిధ్యం వహించే అవకాశం రావడం గౌరవంగా భావిస్తున్నా" "నా సోదరుడికి మీరు ఎంతో ప్రేమను, అభిమానాన్ని పంచారు. అదే ప్రేమను నా పైనా కురిపిస్తారని ఆశిస్తున్నా. చట్టసభలో మీ గళాన్ని వినిపించే అవకాశం ఇవ్వాలని కోరుకుంటున్నా. చిన్నారులు భావి భవిష్యత్తు, మహిళల శ్రేయస్సు కోసం నా శక్తికి మించి కృషి చేస్తానని మాటిస్తున్నా. ప్రజాప్రతినిధిగా పోటీ చేసే ఈ ప్రయాణం నాకు కొత్త కావొచ్చు. కానీ, ప్రజల తరఫున గళం వినిపించేందుకు చేసే పోరాటం మాత్రం కొత్త కాదు. ఈ ప్రయాణంలో మీరంతా నాకు మార్గదర్శకంగా నిలుస్తారని ఆశిస్తున్నా" అని ప్రియాంకా గాంధీ రాసుకొచ్చారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో వయనాడ్ నుంచి పోటీ చేసిన రాహుల్ గాంధీ.. సీపీఐ నాయకురాలు అన్నీ రాజాపై 3.6 లక్షల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. రాహుల్ రాజీనామాతో. జరుగుతోన్న ఉప ఎన్నికలో ప్రియాంకా గాంధీ కాంగ్రెస్ తరఫున పోటీకి దిగారు. కేరళలో పాలక్కాడ్, చెక్కర అసెంబ్లీ స్థానాలతోపాటు వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నిక నవంబర్ 13న జరగనుంది. నవంబర్ 23న ఫలితాలు వెల్లడి కానున్నాయి.

# కేంద్రం కీలక ఆదేశాలు

**న్యూఢిల్లీ,అక్టోబరు 26:**విమానయాన సంస్థలకు ఇటీవల కాలంలో బాంబు బెదిరింపులు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్రం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఇలాంటి బెదిరింపుల వల్ల ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, తప్పుడు వార్తలు వ్యాప్తి చెందకుండా తగిన చర్యలు తీసుకోవాలని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లను ఆదేశించింది. నిబంధనలను అతిక్రమించినట్లయితే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. కేంద్రం ఆదేశాలను ధిక్కరించినట్లయితే థర్డ్ పార్టీ కంటెంట్‌ను ఆయా ప్లాట్‌ఫామ్‌లు తీసుకునే వెసులుబాటును నిలిపివేస్తామని తేల్చి చెప్పింది. వివిధ ఎయిర్‌లైన్‌లకు ఇటీవల వచ్చిన బాంబు బెదిరింపు ఫోన్ కాల్స్, వాటి వల్ల నిలిచిపోయిన, ఆలస్యమైన విమాన సర్వీసులు, ఇతర కార్యకలాపాలను కేంద్రం ఈ సందర్భంగా ప్రస్తావించింది. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని వీలైనంత త్వరగా తప్పుడు వార్తలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరింది.

# ట్రంప్, కమలా హారిస్ ఫోన్ డేటా హ్యాకింగ్!

(మొదటిపేజీ తరువాయి)

ఆమె రన్నింగ్ మేట్ టిమ్ వాజ్ ప్రచారాన్ని కూడా లక్ష్యంగా చేసుకున్నట్లు పేర్కొంది. వెరిజోన్ ఫోన్ సిస్టమ్స్‌లోకి చొరబడిన హ్యాకర్లు సున్నితమైన సమాచారాన్ని దొంగలించేందుకు ప్రయత్నిస్తున్నట్లు సదరు కథనం తెలిపింది. "ఇంటెలిజెన్స్ సమాచారాన్ని సేకరించేందుకు అమెరికా టెలీకమ్యూనికేషన్స్ ప్రొవైడర్లను విదేశీ హ్యాకర్లు లక్ష్యంగా చేసుకున్నట్లు మాకు తెలిసింది. దీన్ని దర్యాప్తు అధికారుల దృష్టికి తీసుకెళ్లాం" అని వెరిజోన్ అధికార ప్రతినిధి ఒకరు మీడియాకు వెల్లడించారు. చైనా ప్రభుత్వం మద్దతు ఉన్న సైబర్ ముఠా 'సాల్ట్ టైఫూన్' ఈ హ్యాకింగ్‌కు పాల్పడి ఉంటారని సైబర్ సెక్యూరిటీ నిపుణులు అంచనా వేస్తున్నారు. ట్రంప్, వాన్స్ ఫోన్ నంబర్లతో పాటు వీరి ప్రచార బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఇద్దరు సిబ్బంది ఫోన్. డేటాను నేరగాళ్లు లక్ష్యంగా చేసుకున్నట్లు వాషింగ్టన్ పోస్ట్ మరో కథనంలో పేర్కొంది. అటు డెమొక్రటిక్ ప్రభుత్వంలోని కొందరు అధికారుల ఫోన్ కమ్యూనికేషన్లను కూడా ట్రాప్ చేస్తున్నట్లు తెలిపింది. ఈ కథనాలపై ఎఫ్బీఐ, సైబర్ సెక్యూరిటీ ఏజెన్సీ సంయుక్త ప్రకటన విడుదల చేసింది. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపింది. అభ్యర్థుల ప్రచార వివరాలతో పాటు కేసులు వంటి సున్నితమైన సమాచారంపై హ్యాకర్లు దృష్టి పెట్టినట్లు తమకు తెలిసిందని అధికారులు వెల్లడించారు.

# శింగనమలలో ఘోర ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

అదుపుతప్పిన కారు.. ఎదురుగా వస్తున్న లారీనీ ఢీకొట్టడంతో నుజ్జునుజ్జు అయింది. ఈ ప్రమాదంలో కారులోని ఆరుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వీరంతా తాడిపత్రిలో నగర కీర్తన వేడుకలో పాల్గొని తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతులంతా అనంతపురానికి చెందిన సంతోష్, షణ్ముక్, వెంకన్న, శ్రీధర్, ప్రసన్న, వెంకీగా గుర్తించారు.

# పెట్టుబడులే లక్ష్యం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 26 (ఆంధ్రపత్రిక):**పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కో నగరానికి చేరుకున్న రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్‌కు ఎయిర్‌పోర్టులో ఐటీ సర్వ్, ఎన్ఆర్ఐ టీడీపీ ప్రతినిధులు అపూర్వ స్వాగతం పలికారు. ఏపీలో ఎన్డీఏ కూటమి "అఖండ" విజయం సాధించిన తర్వాత తొలిసారిగా అమెరికాలో లోకేష్ పర్యటిస్తున్నారు. అక్టోబర్ 25 నుంచి నవంబర్ 1వ తేదీ వరకు మంత్రి లోకేష్ అమెరికా పర్యటన సాగనుంది. ఈనెల 29న లాస్ వేగాస్ నగరంలో జరగనున్న ఐటీ సర్వీస్ సినర్జీ 9వ సదస్సుకు మంత్రి హాజరుకానున్నారు. 31న అట్లాంటాలో ఎన్టీఆర్ ట్రస్ట్ ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో లోకేష్ పాల్గొననున్నారు. శాన్ ఫ్రాన్సిస్కోలో పారిశ్రామికవేత్తలతో మంత్రి లోకేష్ సమావేశమయ్యారు. వై2కె బూమ్ నేపథ్యంలో హైదరాబాద్, బెంగుళూరు నగరాల్లో ఐటీ శరవేగంగా అభివృద్ధి చెందిందని, ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్న ఏఐ అవకాశాలను అందిపుచ్చుకోవడం ద్వారా ఆంధ్రప్రదేశ్ శరవేగంగా అభివృద్ధి సాధించబోతోందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు గల అనుకూలతలు, ప్రభుత్వం అమలు చేస్తున్న ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానాలను మంత్రి వివరించారు. భారత్‌లో రాబోయే పాతికేళ్లలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకోబోతున్నాయని, పరిపాలనలో ఏఐ వినియోగం ద్వారా ప్రజలకు వేగవంతమైన, మెరుగైన సేవలను అందించేందుకు తాము కృషి చేస్తున్నామని తెలిపారు. నాలుగవ సారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు నేతృత్వంలో యువనాయకత్వం చురుగ్గా పనిచేస్తోందన్నారు. మంత్రివర్గంలో 17 మంది కొత్తవారే ఉన్నారని.. విభజిత ఆంధ్రప్రదేశ్‌లో మ్యాన్యుఫ్యాక్చరింగ్, రెన్యువబుల్ ఎనర్జీ, బయో ఎనర్జీ, ఆక్వా, పెట్రో కెమికల్ రంగాల్లో పెట్టుబడులకు విస్తృతమైన అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి ద్వారా పేదరిక నిర్మూలనకు సీఎం సరికొత్త పీ-4 విధానానికి శ్రీకారం చుట్టారని మంత్రి తెలిపారు. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విద్యావ్యవస్థలో మార్పులు తీసువస్తామన్నారు. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా నైపుణ్యతతో కూడిన మానవవనరులను అందించడానికి, తద్వారా యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు విద్యారంగంలో కూడా సంస్కరణలకు శ్రీకారం చుట్టామన్నారు. నవీన ఆవిష్కరణల కోసం విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలకు ప్రాధాన్యతనిస్తూ రీసెర్చి సెంట్రిక్‌గా చర్యలు తీసుకుంటామని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

# క్రిప్టో కరెన్సీతో ఆర్థికరంగంపై ప్రభావం

**న్యూఢిల్లీ, అక్టోబరు 26:** క్రిప్టో కరెన్సీపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ శక్తికాంత దాస్ ఆందోళన వ్యక్తంచేశారు. క్రిప్టోలతో ఆర్థిక స్థిరత్వానికి పెను ముప్పు ఉందన్నారు. 'పేటర్సన్ ఇన్స్టిట్యూట్ ఫర్ ఇంటర్నేషనల్ ఎకనామిక్స్' థింక్ ట్యాంక్‌కు హాజరైన ఆయన క్రిప్టోల గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. క్రిప్టోలతో ద్రవ్య లభ్యత, ఆర్థిక స్థిరత్వానికి భారీ ప్రమాదం పొంచిఉందని దాస్ అన్నారు. దీని కారణంగా ఆర్థిక వ్యవస్థలో ద్రవ్య సరఫరాపై కేంద్ర బ్యాంక్ నియంత్రణ కోల్పోయే అవకాశం ఉందన్నారు. క్రిప్టోలు ఆర్థిక వ్యవస్థపై ఆధిపత్యాన్ని చెలాయించకూడదని తాను అభిప్రాయపడుతున్నట్లు చెప్పారు. అందుకే క్రిప్టోను ప్రమాదకరంగా భావిస్తున్నట్లు ఆయన వివరించారు. క్రిప్టోతో కలిగే భారీ నష్టాలను దృష్టిలో ఉంచుకొని ఈ సమస్యపై అంతర్జాతీయ అవగాహన ఉండాలన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సెంట్రల్ బ్యాంక్‌లకు ఇది ప్రధాన ఆందోళన అని దాస్ తెలిపారు. క్రిప్టో కరెన్సీల గురించి ప్రశ్నల్ని లేవనెత్తిన మొదటి దేశం భారత్ అని దాస్ పేర్కొన్నారు. భారత్ అధ్యక్షతన జరిగిన జీ20 శిఖరాగ్ర సదస్సులో క్రిప్టోపై ఎలా వ్యవహరించాలనే అంశంపై అంతర్జాతీయ అవగాహనను పెంపొందించేందుకు ఒప్పందం జరిగిందని గుర్తుకుతెచ్చారు. క్రిప్టోపై ఆందోళన వ్యక్తంచేసిన మొదటి సెంట్రల్ బ్యాంకుల్లో తమ బ్యాంకు కూడా ఒకటన్నారు. "ఆర్థికవ్యవస్థలో క్రిప్టో ఆధిపత్యం చెలాయిస్తే సెంట్రల్ బ్యాంక్ ద్రవ్య వ్యవస్థపై నియంత్రణ కోల్పోతుంది. ఇది ద్రవ్య వ్యవస్థలో అస్థిరతకు దారితీస్తుంది. అంతేకాదు ఆర్థికరంగంపై ప్రభావం చూపుతుంది" అని ఆయన అన్నారు. అందుకే ఈ విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.






దక్షిణ బైపాస్ రోడ్డులోని సాయి ఐ.టి.ఏ.కన్వెన్షన్‌లో జరిగిన 43వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డెంటల్ కాన్ఫరెన్స్‌లో పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యురాలు గల్లా మాధవి, మరియు డా..నామినేని కిరణ్ కుమార్, డా.. శ్రీధర్ బాబు డా..సుధాకర్ రాజు, డా..రామచంద్ర రెడ్డి, మరియు తదితర డాక్టర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా పార్టీ కార్యాలయంలో శాశ్వత సభ్యత్వం తీసుకున్న మేయర్ గంగాడ సుజాత, పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్, తదితర నాయకులు మరియు కార్యకర్తలు.



తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి

## తొలిరోజు ఇన్నింగ్స్‌లో 295 పరుగులు చేసిన

# ఆంధ్ర

### – అద్భుతంగా ఆంధ్ర, హిమాచల్ రంజీ మ్యాచ్



**మధురవాడ, అక్టోబరు 26 (ఆంధ్రపత్రిక):** ఆంధ్ర, హిమాచల్ ప్రదేశ్ గ్రూప్ బి రంజీ ట్రోఫీ మ్యాచ్ శనివారం విశాఖపట్నం పీఎం పాలెంలోని ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో తొలి ఇన్నింగ్స్ మ్యాచ్ ఘనంగా ప్రారంభమయ్యింది. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన మ్యాచ్లో ముందుగా టాస్ గెలిచి హిమాచల్ ప్రదేశ్ బౌలింగ్ ఎన్నుకుంది. బ్యాటింగ్ బరిలోకి దిగిన ఆంధ్ర జట్టు తొలి రోజు ఇన్నింగ్స్ లో గడిచిన 80 ఓవర్లకు 295 పరుగులు చేసి ఆరు వికెట్లు కోల్పోయింది. ముందుగా దిగిన ఓపెనర్ బ్యాట్స్మెన్లు అంతగా రాణించలేక తక్కువ పరుగులకే వికెట్ల కోల్పోయారు. మిడిల్ ఆర్డర్లో దిగిన కెప్టెన్ ఎస్.కె రషీద్ 132 బంతుల్లో 9 ఫోర్లుతో 69 పరుగులు చేసి వికెట్ కోల్పోయాడు. జి హనుమ విహారి కూడా అద్భుతంగా రాణించి 115 బంతుల్లో 12 ఫోర్లతో 66 పరుగులు చేసి ఔటయ్యాడు. తర్వాత దిగిన భారత క్రికెటర్ కె.ఎస్.భరత్ తన సొంత గడ్డపై విరిచిత ఆట తీరును ప్రదర్శించాడు. వన్డే తరహాలో కేవలం 39 బంతుల్లో 8 ఫోర్లు 3 సిక్స్‌లతో 65 పరుగులు చేసి దిగిన ముగ్గురు బ్యాట్స్మెన్లు కూడా అర్ధ సెంచరీలు పూర్తి చేసి స్కోర్ ను ముందుకు నడిపించారు. తర్వాత దిగిన జి. మనీష్ 31, టి. విజయ్ లు 21 పరుగులు చేసి తొలి రోజు ఇన్నింగ్స్ ముగిసేసరికి నాటౌట్ గా బరిలో నిలిచారు. దీనితో ఆంధ్ర జట్టు తొలి రోజు 295 పరుగులు చేసి ఆరు వికెట్లు నష్టపోయింది.

**బౌలింగ్ బరిలో హిమాచల్‌ప్రదేశ్**

బౌలింగ్ బరిలోకి దిగిన హిమాచల్ ప్రదేశ్ దివేష్ ఆర్ శర్మ, కెప్టెన్ రిషి ఆర్ దావన్ లు తలోక రెండు వికెట్లు చొప్పున తీసుకున్నారు. అలాగే అర్పిత్,ముకుల్ లు తలోఒకటి వికెట్లు చొప్పున కైవసం చేసుకున్నారు..

# జగన్‌పై వైఎస్ షర్మిల మండిపాటు

(మొదటిపేజీ తరువాయి)




అంటూ తమ ఆస్తులపై జగన్ చేసిన వ్యాఖ్యలపై షర్మిల మండిపడ్డారు. తల్లిపై కేసులు పెట్టి కోర్టుకు లాగడం ఎక్కడ్కెనా ఉందా అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఎమోషన్‌కు గురైన షర్మిల కన్నీటి పర్యంత అయ్యారు. విజయవాడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. సుబ్బారెడ్డి వ్యాఖ్యపై స్పందించారు. 'నా బిడ్డలు కూడా మీ కళ్ల ముందే పెరిగారు.. వారికి అన్యాయం చేయాలని ఎలా అనిపించింది. అన్ని విషయాలు తెలిసి కూడా బాబాయి ఎందుకిలా మాట్లాడుతున్నారు' అని అన్నారు. జగన్ పదవులు ఇస్తే సుబ్బారెడ్డి అనుభవిస్తున్నారు. ఆయన అలా మాట్లాడకపోతే ఇంకెలా మాట్లాడుతారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు సుబ్బారెడ్డి, ఆయన కుమారుడు ఆర్థికంగా లాభపడ్డారు. సుబ్బారెడ్డే కాదు.. సాయిరెడ్డి కూడా అలాగే మాట్లాడొచ్చు.

ఎందుకంటే ఆయన కూడా వాళ్ల టీమ్‌లోనే ఉన్నారు. జగన్ పక్కన వాళ్లు ఉన్నారని తెలిసి కూడా నిన్న రాసిన లేఖలో వాళ్ల పేర్లు ప్రస్తావించాను. నేను చెబుతున్నది నిజమని ప్రమాణం చేయగలను. సుబ్బారెడ్డి చెబుతున్నది కూడా నిజమని ఆయన ప్రమాణం చేయగలరా? నలుగురు మనవళ్లకు ఆస్తిలో సమాన వాటా అని రాజశేఖర్‌రెడ్డి బ్రతికుండగానే చెప్పారు.

ఇది నిజం.. నా బిడ్డలమీద ప్రమాణం చేసి చెబుతున్నా. ఇది నిజం కాదని.. సుబ్బారెడ్డి, జగన్ ఇద్దరూ వారి బిడ్డలపై ప్రమాణం చేసి చెప్పగలరా? నాకు రావాల్సిన ఆస్తిలో వాటా ఇవ్వకుండా ఏవో చెబితే ఎలా? నా మేలు కోరతానని వైఎస్‌కు జగన్ మాట ఇచ్చారు. సాక్షిలో, భారతి సిమెంట్స్‌లో వాటాలు మావని జగన్ ఎలా చెబుతా రు? కంపెనీలకు భారతి, జగతి అని వాళ్ల పేర్లు పెట్టుకున్నారట. ఆ రోజు ఆ పేర్లు పెట్టుకోగలిగారంటే కారణం.. రాజశేఖర్‌రెడ్డి అనుమ తిచ్చా రు. నేను అడ్డు చెప్పలేదు కాబట్టే. పేర్లు పెట్టుకున్నంత మాత్రాన ఆస్తులు మొత్తం వారివే అనే రూల్ ఏమైనా ఉందా? ఆస్తులు మొత్తం జగన్‌వే కాబట్టి ఆయన జైలుకు వెళ్లారని సుబ్బారెడ్డి చెబుతున్నారు. భారతి పేరు మీద ఆస్తులు ఉంటే ఆమె ఎందుకు జైలుకు వెళ్లలేదు? ఎవరైనా గిఫ్ట్ ఇస్తే ఎంవోయూ రాసుకుంటారా? వీరీరు ఎంవోయూ రాశారంటేనే ఇవ్వాల్సిన బాధ్యత ఉందని అర్థం. దీనికి సుబ్బారెడ్డి సమాధానం చెప్పాలి. కన్నతల్లిపై కేసు వేసిన వ్యక్తి ఈ లోకంలో ఎవరైనా ఉన్నారా? ఇలాంటి గొడవలు అందరి ఇళ్లలో ఉండేవే అని అని సునాయాసంగా మాట్లాడుతున్నారు. జగన్ కోసం నేను, అమ్మ.. ఎంతో కష్టపడ్డాం. ఐదేళ్లుగా ఎంవోయూ నా దగ్గర ఉన్నా ఒక్క మీడియా హౌస్‌కు వెళ్లలేదు. ఎన్ని కష్టాలు వచ్చినా ఎంవోయూ వాడుకోలేదు.. ఎక్కడా బయటపెట్టలేదు. వైఎస్ కుటుం బం గురించి చెడ్డగా చెప్పుకొంటారనే ఎంవోయూ గురించి ఎప్పుడూ చెప్పలేదు. జగన్ కోసం రెండు ఎన్నికల్లో పాదయాత్ర చేశా. చెల్లి కోసం ఇది చేశానని జగన్ జన్మలో ఒక్కట్కెనా చెప్పగలరా? జగన్ బెయిల్ రద్దవుతుంది కాబట్టి కోర్టులో కేసు వేశామని చెబుతున్నారు. తనకి లాభం జరుగుతుంది అంటే తల్లిని కోర్టుకు ఈడుస్తారా? సొంత కుమారుడే తల్లిని కోర్టుకు లాగడం దారుణం కాదా? రాజశేఖర్‌రెడ్డి పేరు ఎఫ్ఐఆర్‌లో లేకపోతే.. కేసు నుంచి జగన్ బయటపడటం అసాధ్యమని భావించి పొన్నవోలు సుధాకర్‌రెడ్డి మూడు కోర్టుల చుట్టూ తిరిగి రాజశేఖర్‌రెడ్డి పేరును సీబీఐ ఎఫ్ఐఆర్‌లో చేర్పించారు. తనకు లాభం జరుగుతుందను కుంటే ఎంతటివా రిన్కెనా జగన్ అణచివేస్తారు. విజయమ్మను కోర్టుకు లాగడానికి కారణం ఎవరు? మీ నాయకుడు ఎలాంటి వాడో వైకాపా శ్రేణులు ఆలోచించాలి. జగన్ లాంటి వ్యక్తి నాయ కుడో.. శాడిస్టో వైకాపా నేతలు అర్థం చేసుకోవాలి. నేనేం తప్పు చేశానో చెప్పాలని వైకాపా నేతలు, కార్యకర్తల్ని అడుగుతున్నా అని షర్మిల అన్నారు.

విజయవాడ బందర్ రోడ్డుకి సమీపంలో గంగూరు ధనేకుల ఇంజనీరింగ్ కళాశాల ఎదురుగా ప్రైమ్ లోకాలిటీలో 40 సెంట్లు సైటు అమ్మబడును

సంప్ర : 98663 83383







శనివారం విజయవాడలోని ఏఆర్ గ్రౌండ్స్‌లో పోలీస్ సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఆయుధాలు, ఇతర సామగ్రిని వీక్షిస్తున్న విద్యార్థులు

ఆంధ్రపత్రిక ఫొటోలు: సి.హెచ్.విజయభాస్కర్








Printed and Published by KANCHARLA RAMAIAH behalf of Nageswara Rao Estates Private Limited, Printed at jagati publication Limited. Sakshi Press, Survey No 86/10, Madhurawada village, MCV Limits, Visakhapatnam - 530041, (AP), Published at D.No50-39-5/A, NORTH EXTENSION LAYOUT, NEAR STATE BANK OF HYDERABAD, SEETAMMADHARA, VISAKHAPATNAM-530013 Editor:KANCHARLA RAMAIAH.Excutive editor V.VIJAYALAKSHMI. RNI NO.10721/65 CELL 9849998069, Email:andhrapatrikadaily@gmail.com